



అమరావతి సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరిగే సమావేశ మందిరం



తేమ శాతం పేరిట తకరారు.. సహకరించని అధికారులు.. మొండికేస్తున్న మిల్లర్లు.. చేను దాటని గింజలు.. రోడ్లపైనే ధాన్యం నిల్వలు.. అనుమతి కోసం అన్నదాతల నిరీక్షణ.. గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు.. ఇదీ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి. చివరి గింజ వరకు కొంటాం.. తేమ శాతంలో వెసులుబాటు ఇచ్చాం.. వ్యవసాయశాఖ మిల్లర్ల కోసం కాకుండా రైతుల కోసం పనిచేయాలి.. అని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో కొర్రీలతో కొనుగోళ్లు సక్రమంగా జరగడంలేదు. పంట పండించేందుకు.. దానిని ప్రకృతి అవాంతరాల నుంచి రక్షించేందుకు.. ఎంతగా రైతులు కష్టపడ్డారో అంతకు మించి విక్రయించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఓ పక్క వాయుగుండం కంటిపై కునుకు లేకుండా చేస్తుంటే ఆర్.ఎస్.కెలు, మిల్లుల చుట్టూ రైతులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అయినా అధికారులు, మిల్లర్లు కనీసంగా కూడా కనికరించడంలేదు. చాలామంది గిట్టుబాటు ధర రాకపోయినా, వచ్చినరేటుకు చేలల్లోనే ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు.

కొనుగోళ్లకు.. కొర్రీలు


నరసరావుపేట : పొలంలోనే ధాన్యం


చేలల్లోనే ఉన్న ధాన్యం బస్తాలు

- తేమ శాతం పేరిట తకరారు
- అన్నదాతకు నో.. దళారులకు సై
- కొనసాగుతున్న ధాన్యం రైతుల కష్టాలు
- అనుమతి రాక పొలాలు, రోడ్లపైనే నిల్వలు
- గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు
- చేసేదిలేక దళారులకు తెగనమ్ముకుంటున్న వైనం
- వ్యవసాయశాఖ విఫలం.. కొరవడిన మిల్లర్ల సహకారం
- బ్యాంకు గ్యారెంటీల నుంచి గన్నీ సంచుల వరకు గందరగోళం
- మరో రెండు వారాల్లో లక్ష్యం పూర్తి.. ఆ తర్వాత స్పష్టత కరువు
- పల్నాడులో 2 లక్షల టన్నుల దిగుబడి.. కొనుగోలు లక్ష్యం 5 వేల టన్నులే

తెనాలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దేనికీ వెనకాడకుండా ధాన్యం రైతుల కోసం కొనుగోళ్లలో అనేక మార్పులు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం.. కొరవడిన మిల్లర్ల సహకారంతో రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు వాయుగుండం హెచ్చరికలతో అన్నదాత వణికిపోతున్నా అధికారుల్లో చలనం లేదన్న విమర్శలున్నాయి. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చెయ్యాలని పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖలను మంత్రి మనోహర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదు. వాతావరణ పరిస్థితుల్లో ముమ్మరంగా వరి నూర్పిడులు జరుగుతున్నాయి. అయితే ఆ స్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదు. ఈ ఏడాది ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని సంతోషంగా ఉన్నా రైతులను అమ్మకాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు లక్ష్యం పరిశీలిస్తే మొక్కుబడిగానే ఉన్నట్టు చెప్పవచ్చు. ఒక్క గుంటూరు జిల్లాలో మినహా బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడా గోతాలు అందుబాటులో లేవు. అత్యధిక సాగు జరుగుతున్న బాపట్ల జిల్లాలో గోతాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరి సాగైతే కేవలం 1.05 లక్షల గోతాలు మాత్రమే అందుబాటులో ఉంచారు. బాపట్ల జిల్లాలో 3.8 లక్షల ఎకరాల్లో వరి సాగవగా పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసిన గోతాలు కేవలం 70 వేలు మాత్రమే. అదికూడా కొన్నామని లెక్కలు చూపటం మినహా రైతులకు అందుతున్నది అంతంతే. ఎదురుచూపులు చూడలేక చివరకు రైతులే ఒక్కో గోతానికి రూ.30 నుంచి రూ.35 వరకు ఖర్చుచేసి కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. రవాణాకు వాహనాల పరిస్థితి సరేసరి. ముఠా కూలీల విషయంలో మిల్లర్లు, దళారులు కలసి దగా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కాటా కూలీలను రైతుల దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, దళారులు చెబితేనే వారు కదలడంలేదని చెబుతున్నారు. దళారులు కొనుగోలు చేస్తున్న ధాన్యం బస్తాల దగ్గరకు మాత్రం నిమిషాల్లో వెళ్లిపోతున్నారని, రాత్రివేళల్లోనూ కాటా వేసేస్తున్నారంటున్నారు. తాము అడిగితే ఖాళీ లేదని దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలోని రైస్ మిల్లుకే ధాన్యం తీసుకెళ్లొచ్చన్న పాలకుల మాటలు అమలు కావడంలేదు. దాదాపు 45 కిలోమీటర్ల దూరంలోని రైస్‌మిల్లులకు ధాన్యం తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వం తేమ శాతం 17 వరకు పరిమితి పెడితే, కోస్తాలోని ఐదు జిల్లాల్లో దానిని 25 శాతానికి మినహాయింపు ఇచ్చింది. తేమ శాతాన్ని ఆర్.ఎస్.కెలు పరీక్షిస్తాయని, మిల్లులు చేయాల్సిన అవసరం లేదని

(మిగతా 8వ పేజీలో)

మిల్లర్ల రివర్స్ దోపిడీ

మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే 75 కిలోల బస్తాకు ధాన్యం కేటగిరీని బట్టి రూ.1725 నుంచి రూ.1740 చెల్లించాలి. అదే దళారుల నుంచి కొన్న ధాన్యానికి అయితే రూ.1300 నుంచి రూ.1350 వరకు వెచ్చిస్తే సరిపోతుంది. అంటే ఎంత లేదన్నా గిట్టుబాటు ధరకు, మార్కెట్ ధరకు రూ.400 నుంచి రూ.450 వరకు బస్తా ధరలో వ్యత్యాసం ఉంటుంది. అదే తేమ సాకు చూపి కోత వేస్తే మరో రూ.200 వరకు అదనం. బ్యాక్ గ్యారెంటీ సాకుతో కొంతమంది మిల్లర్లు రైతుల నుంచి నేరుగా కొనకుండా, దళారుల ద్వారా వచ్చిన ధాన్యాన్ని కొంటున్నారని సమాచారం. ఆర్.ఎస్.కేల్లోని సిబ్బంది సహకారంతో దళారుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మినట్లు చూపిస్తున్నారు. ఇందులో రైతులకు రావాల్సిన గిట్టుబాటు ధరను కూడా మిల్లర్లు దోచేస్తున్నారనేది ఆరోపణ.

జాగ్రత్తలు తీసుకుంటాం

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. మిల్లులకు బ్యాంక్ గ్యారంటీ లేదనే మాట వాస్తవం కాదు. తుఫాన్ సమయంలో ఒకేసారి ధాన్యం పెద్దమొత్తంలో కొనాల్సిరావడం వల్ల అప్పట్లో ఇబ్బంది వచ్చింది. ఇప్పుడు ఏ మిల్లులో కూడా గ్యారెంటీ సమస్య లేదు. రైతులకు 1.30 లక్షల గోతాలను అందిస్తున్నాం. ఎవరైనా రైతులను మోసగించే మాటలు చెబితే, సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

-శ్రీలక్ష్మి, డీఎం సివిల్ సప్లైస్, గుంటూరు


కలెక్టర్ నాగలక్ష్మి

నివేదికలతో.. అమరావతికి

- మూడు రోజులుగా ముమ్మర కసరత్తు
- సచివాలయంలో నేడు, రేపు కలెక్టర్ల సదస్సు
- సమగ్ర వివరాలతో సదస్సుకు కలెక్టర్ నాగలక్ష్మి

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు అవుతుంది.బుధ, గురువారాల్లో రాజధాని అమరావతి సచివాలయంలో జరగనున్న ఈ సదస్సులో వివిధ అంశాలపై చర్చలు, సమీక్షలు నిర్వహించనున్నారు. రెండో రోజు సాయంత్రం డీడీపీలపై ప్రజంటేషన్ జరగనుంది. కలెక్టర్లు సమర్పించే ప్రణాళికల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందినవి మాత్రమే కమిటీ ఎంపిక చేసి ప్రదర్శనకు అనుమతి ఇవ్వనుంది. ఆరు నెలల పాలనలో వివిధ విభాగల పనితీరును మదింపు చేయడంతో పాటు జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి రచించాల్సిన ప్రణాళికలపై సీఎం అధ్యక్షతన సమగ్రంగా చర్చించనున్నారు. ఈ సదస్సులో పాల్గొనడానికి కలెక్టర్ నాగలక్ష్మి సిద్ధమయ్యారు. ఈ సదస్సులో నివేదించాల్సిన అంశాలపై గడచిన మూడు రోజులుగా వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై సమగ్ర వివరాలను సేకరించారు. రెవెన్యూ సంబంధమైన అంశాలతో పాటు ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పరిష్కారం ఏ స్థాయిలో ఉంది, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన పనులు తదితర వివరాలతో పూర్తి స్థాయిలో కలెక్టర్ సదస్సులో పాల్గొనబోతున్నారు. ఆరు నెలల కూటమి పాలన సాధించిన విజయాలు, కలెక్టర్ దృష్టికి వచ్చిన లోటుపాట్లపై చర్చ జరగనుందనేది సమాచారం. వివిధ పనులు చేపట్టడానికి సమగ్ర నివేదికలు అందించి వాటికి నిధులు విడుదల చేయాలనే అభ్యర్థనను కూడా సీఎంకు కలెక్టర్ విన్నవించే అవకాశాలు ఉన్నాయి.

ప్రజంటేషన్‌తో సిద్ధం..

ప్రధానంగా ప్రాథమిక పరపతి సహకార సంఘాలన్నింటిని బ్యాంకుల తరహాలో మార్పు చేసి సేవలందించేలా వాటి కంప్యూటరీకరణని 100 శాతం పూర్తి చేయించారు. ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు లభ్యం కావడం కష్టమైపోయిన ప్రస్తుత తరుణంలో కంపెనీలతో మాట్లాడి ఒక మెగా జాబ్‌మేళా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఆ మేళాకు కనీసం 120 కంపెనీలు హాజరయ్యేలా చూసేందుకు చర్చలు జరుపుతున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల రూపుమార్పు, ఈ నెలాఖరుకు గుంతలు లేని రోడ్లుగా రహదారులను తీర్చిదిద్దడం, ఆ దిశగా చేపట్టిన పనులను ప్రజంటేషన్‌లో వివరించనున్నట్లు చెప్పారు. మంగళగిరిలో ఏర్పాటు చేయబోతున్న స్వర్ణ, చేనేతల క్లస్టర్ల గురించి ప్రజంటేషన్‌లో పొందుపరిచారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర, సుస్థిరాభివృద్ధి, సుపరిపాలన, వ్యవసాయం, సర్వీసు, పారిశ్రామిక రంగాల్లో ఏటా 15 శాతం తగ్గకుండా వృద్ధిరేటు సాధించాలనేది లక్ష్యం. అలానే 59 వేల మంది ప్రజలు జిల్లా అభివృద్ధి కోసం వారి ఆలోచనలను ఆన్‌లైన్‌లో జిల్లా యంత్రాంగంతో పంచుకున్నారు. వాటిని కూడా జిల్లా అభివృద్ధి ప్రణాళికలో క్రోడీకరించారు. ఇంకా మరికొన్ని అంశాలతో డీడీపీని నివేదించినట్లు కలెక్టర్ తెలిపారు.

డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రం

- అక్టోబరు 2 నాటికి తీర్చిదిద్దుతాం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చెత్త పేరుకుపోయింది
- ప్రజలపై చెత్త పన్ను భారాన్ని తొలగించాం
- రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ


జిందాల్ ప్రాజెక్టు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ. ఎమ్మెల్యే పుల్లారావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు

8

6లో
విద్యుత్‌శాఖ ఉద్యోగులకూ ముఖ హాజరు
- తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమలు
- యాప్ డౌన్‌లోడ్‌కు అధికారుల ఆదేశాలు

దోపిడీ ముఠాల ఆటకట్టు
గుంటూరుకు చెందిన పదిమంది అరెస్టు
ఆటోల్లో ప్రయాణికుల మాదిరిగా ఉంటూ నేరాలు

రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆదేశాలు

45 రకాల జబ్బులకు ఉచిత వైద్యం
- బాలసురక్ష వాహనం ప్రారంభించిన కలెక్టర్ నాగలక్ష్మి
8లో

ఇక అమరావతి పరుగులు

- పనులకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం
- 20 పనులకు రూ.11,467 కోట్లు కేటాయింపు
- రాజధానిలో ఆగిపోయిన హ్యాపీనెస్టుకూ మోక్షం
- ఏడీబీ, ప్రపంచ బ్యాంకుల నుంచి భారీగా నిధులు



గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏడీబీ, ప్రపంచ బ్యాంకుల నుంచి భారీగా నిధులు.. కూటమి ప్రభుత్వ పట్టుదల.. సీఆర్‌డీఏ అథారిటీ ప్రత్యేక దృష్టి నేపథ్యంలో రాజధాని అమరావతిలో పనులు పరుగులు తీయనున్నాయి. సీఆర్డీఏ ఈ నెల 2న సిద్ధం చేసిన ప్రతిపాదనలకు ఆ మరుసటి రోజు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ క్రమంలో గతంలో ఆగిపోయిన పనుల పునరుద్ధరణకు మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు జీవో 968ను కూడా జారీ చేసింది. ఏపీసీఆర్డీఏ ప్రతిపాదించిన 20 రకాల పనులకు రూ.11,467 కోట్లు కేటాయించింది. గతంలో ఆయా పనులకు సంబంధించి టెండర్ల కాలపరిమితి తీరిపోగా పనులను పునఃప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది.

రాజధానిలో పనుల సందడి..


గత టీడీపీ ప్రభుత్వం వేల ఎకరాల భూములు సేకరించి రూ.10 వేల కోట్లతో అనేక ప్రభుత్వ భవనాలను, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను రాజధానిలో నిర్మించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అమరావతిని శ్మశానంగా మార్చే ఉద్దేశంతో పనులను నిలిపేసింది. దీంతో రాజధాని పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. కాగా ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని పునర్నిర్మాణంపై దృష్టి పెట్టింది. తొలుత రూ.36.5 కోట్లతో 29 గ్రామాల్లోని 24 వేల ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టింది. 2014- 19లోనే తుది దశకు చేరిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవనాలు మొదలు, గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, క్లాస్- 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్ల నిర్మాణ పనులు సహా మొత్తం 20 రకాల పనులు తక్షణం ప్రారంభం కానున్నాయి. రూ.594.54 కోట్లతో భవనాలను పూర్తి చేయడంతోపాటు, మరో రూ.226.26 కోట్లతో తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజి, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, భవన సంరక్షణ తదితర సదుపాయాలు కల్పించనున్నారు. రూ.594.36 కోట్లతో నాన్ గెజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, రూ.516.6 కోట్లతో ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల నివాసాలు, న్యాయమూర్తుల భవనాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

లే అవుట్ల అభివృద్ధికి రూ.3,859.66 కోట్లు

భూ సమీకరణ(ఎల్‌పీఎస్) విధానంలో భూములిచ్చిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. తొలివిడతగా 8,496.3 ఎకరాల్లో ప్లాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీటి సరఫరా, వరద నీరు, మురుగునీరు పారుదల, విద్యుత్, ఐటీసీ కేబుళ్ల, రోడ్ల వెంట వాకింగ్ ట్రాకులు, సైక్లింగు ట్రాకులను రూ.3,859.66 కోట్లతో నిర్మించనున్నారు. రూ.1,585 కోట్లతో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు, శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రూ.984కోట్లతో హ్యాపీనెస్ట్ ప్రాజక్టు కింద నిర్మించనున్న 12 టవర్లతో 1200 అపార్ట్‌మెంట్లు నిర్మించనున్నారు.

ఆర్-5 జోన్ స్థలాలకి ప్రత్యామ్నాయం

కలెక్టర్ నాగలక్ష్మికి ప్రభుత్వం ఆదేశాలు



గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పరిధిలో గత వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ఆర్-5 జోన్ ఏర్పాటు చేసి గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో పేదలకు పంపిణీ చేసిన నివేశన స్థలాలకు ప్రత్యామ్నాయం చూడాలని గుంటూరు, ఎన్టీఆర్ కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైసీపీ హయాంలో ఆర్-5 జోన్‌లో 50,792 మందికి నివేశన స్థలాలు పంపిణీ చేశారు. వారిలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 27,031, గుంటూరు జిల్లా నుంచి 23,761 మంది ఉన్నారు. ఇందుకోసం రాజధానిలోని వేర్వేరు గ్రామాల్లో 1402.58 ఎకరాల్లో లేఅవుట్లు వేసి నిధులు దుబారా చేశారు. దీనిని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీతో పాటు రాజధాని రైతులు కూడా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పట్లో వైసీపీ పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలకు సంబంధించి పునర్‌పరిశీలన జరిపించింది. దాదాపు 7506 మంది అనర్హులుగా తేలారు. వారిలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 3,183, గుంటూరులో 4,323 నకిలీ ఎంట్రీలున్నాయని తేల్చారు. 43,286 మందిని అర్హులుగా గుర్తించి, వారి కోసం ఎన్టీఆర్ జిల్లాలో 265 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 216 ఎకరాల భూమి అవసరం అవుతుందని . కాగా ఇప్పటివరకు ఎన్‌టీఆర్ జిల్లాలో 80 ఎకరాలు, గుంటూరులో 216 ఎకరాలు అవసరమని గుర్తించారు. ఈ క్రమంలో మరోసారి లబ్ధిదారుల అర్హతలను పునర్‌పరిశీలన చేయాలని ప్రభుత్వం కలెక్టర్‌ని ఆదేశిస్తూ ప్రజంటేషన్ రీమార్కులలో పేర్కొన్నది.

వీధికుక్కల స్టెరిలైజేషన్‌లో వెనకడుగు

వీధికుక్కల నియంత్రణలో భాగంగా జిల్లాకు కేటాయించిన స్టెరిలైజేషన్‌లో గుంటూరు వెనకబడింది. మొత్తం 38,922 శునకాలకు స్టెరిలైజేషన్ చేయించాల్సి ఉండగా కేవలం 4840 కుక్కలకే చేయించారు. ఇంకా 34 వేల పైచిలుకు కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించాలి.

మంగళగిరికి సమీపంలో ఐటీ పార్కు

మంగళగిరికి సమీపంలో ఐటీ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇందుకోసం 200 ఎకరాల భూమి అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలో అనువైన భూమిని అన్వేషించాల్సిందిగా కలెక్టర్‌ని ఆదేశించింది. ఇదే విషయాన్ని కలెక్టర్ల సదస్సు సందర్భంగా ప్రభుత్వం నొక్కి వక్కాణించనుంది.

అమరావతిలో భూములు కోరిన ప్రముఖ సంస్థలు

అమరావతిలో భూములు కేటాయించాలని ఐఆర్‌సీటీసీ లిమిటెడ్, వాతావరణ కోర్, ఐహెచ్‌సీఎల్(తాజ్ గ్రూపు), ఒబెరాయి, రహేజ గ్రూపులు కోరాయి. ఐఆర్‌సీటీ సంస్థ 2 నుంచి మూడు ఎకరాలు, వాతావరణ కోర్ సంస్థ, ఐహెచ్‌సీఎల్, ఒబెరాయి గ్రూపులు 10 ఎకరాల చొప్పున, రహేజ సంస్థ అమరావతి రివర్‌ఫ్రంట్‌లో 5 ఎకరాల భూమిని కోరింది. ఈ విషయాన్ని కలెక్టర్‌కు ప్రభుత్వం నివేదించనుంది.

జీవీఏలో 8వ ర్యాంకు

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర జీవీఏ పెరుగుదలకు గుంటూరు జిల్లా నామమాత్రంగానే దోహదం చేసింది. వ్యవసాయంలో 2.24, పారిశ్రామిక రంగంలో 4.34, సర్వీసు రంగంలో 6.57 శాతం మాత్రమే పెరిగింది. మొత్తంగా చూసుకుంటే 4.48 శాతం మాత్రమే రాష్ట్ర జీవీఏకి కంట్రిబ్యూషన్ చేయడం వల్ల 8వ ర్యాంకులో నిలిచింది. అలానే ప్రస్తుత ధరల ప్రకారం గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడెక్టు 2028-29 నాటికి 58,388 నుంచి రూ.1,31,705 కోట్లకి చేరుకోవచ్చని అంచనా వేశారు.

రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

● సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్



సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ, డీఆర్వో

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబరు 17న ఇక్కడికి రానున్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన ఎయిమ్స్‌లో రాష్ట్రపతి పర్య టనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎయిమ్స్, వైద్య ఆరోగ్య శాఖ, కృష్ణా-గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 17వ తేదీ ఉదయం 11.20 గంటలకు భారత వాయు సేన విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి రాష్ట్రపతి చేర ుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 12.05 గంటలకు మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం నుంచి తిరిగి ప్రయాణం అవుతారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌ఎస్‌కే ఖాజావలి హాజరయ్యారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగులకు ఇకపై ముఖహాజరు

● తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమలు
● విడతల వారీగా డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో
● యాప్ డౌన్‌లోడ్‌కు ఉన్నతాధికారుల ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో ఉద్యోగులకు ఇకపై ముఖ ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ (ఎఫ్‌ఆర్‌ఏ)) విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. విద్యుత్ శాఖలో ప్రవేశపెడుతున్న ఈ సరికొత్త విధానాన్ని తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమల్లోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌ఆర్‌ఏ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గుంటూరు సర్కిల్ కార్యాలయం విద్యుత్ భవన్‌లో ఉద్యోగులు సదరు యాప్‌ను తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఉన్న తాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. కాగా, జనవరి 1 నుంచి పూర్తి స్థాయిలో ఎఫ్‌ఆర్‌ఏ అమల్లోకి తీసుకురానున్నట్లు విద్యుత్‌శాఖ వర్గాలు స్పష్టం చేశాయి. గుంటూరు, సీఆర్‌డీఏ, పల్నాడు, బాపట్ల సర్కిల్ కార్యాలయాల ఉద్యోగులకు దీనిని తొలి సారి అమలు చేయనున్నారు. సర్కిల్ కార్యాలయంలో ఎఫ్‌ఆర్‌ఏ అమల్లోకి వచ్చిన తర్వాత విడతల వారీగా డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లోనూ అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులకు ఫేస్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే తర హాలో విద్యుత్ ఉద్యోగులకూ ఈ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ప్రభుత్వ కార్యాలయల్లో సమయ పాలన పాటించడంతో పాటు పనిలో వేగం పుంజుకునేలా చర్యలు తీసుకుంటు న్నారు. ఎప్పుడూ పరిపాలనలో పారదర్శకత, పనిలో వేగంపై ప్రత్యేక దృష్టి సారించే సీఎం చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్‌శాఖలో కూడా ఈ సరికొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విధానం ద్వారా ఉద్యోగులు సమయపాన పాటించడంతో పాటు కార్యాలయా ల్లో పనిలో కూడా వేగం పుంజుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

జంగమహేశ్వరపాడు నాటుబాంబుల కేసులో
పోలీసుల అదుపులో వైసీపీ నేత శ్రీనునాయక్



శ్రీనునాయక్ (ఫైల్‌ఫోటో)

దుర్గి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకిరాలకు చెందిన వైసీపీ నేత రమావత్ శ్రీనునాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణంలోని కోర్టులో మంగళవారం లొంగిపోయేందుకు వచ్చిన శ్రీను నాయక్‌ను అప్పటికే ముందస్తు సమాచారంతో కాపుకాచి ఉన్న దుర్గి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సమయంలో జంగమహేశ్వరపాడులో పోలీసులు నాటుబాంబులు, వేట కొడవళ్లను గుర్తించారు. కాగా, జూలై 7న అదే గ్రామంలో నాటుబాంబు పేలడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆయా కేసులలో శ్రీనునాయక్ నిందితుడిగా ఉన్నాడు. అయితే ఈ కేసుల్లో ప్రధాన నిందితునిగా ఉన్న వైసీపీ నేత మన్నెయ్య గత నెల 29వ తేదీన మాచర్ల పట్టణంలోని కోర్టులో లొంగిపోగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా మన్నెయ్యకు తశ్రీనునాయక్ ప్రధాన అనుచరుడు.

విజ్ఞాన్ వర్సిటీ వీసీకి గౌరవ కల్నల్ ర్యాంక్



గౌరవ కల్నల్ సర్టిఫికెట్ అందుకుంటున్న పీ నాగభూషణ్

గుంటూరు(విద్య),డిసెంబరు 10: చేబ్రోలు మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూని వర్సిటీ వైస్ చాన్స లర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్‌కు ఎన్‌సీసీ విభా గంలో గౌరవ కల్నల్ ర్యాం క్‌ను మంగళ వారం అందు కున్నారు. న్యూఢిల్లీలోని గవ ర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ వారు ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడర్ వీ. మధుసూదన్ రెడ్డి విజ్ఞాన్ యూనివర్సిటీకి విచ్చేసి నాగ భూషణ్‌కు ఈ ర్యాంక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీను సమగ్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి గాను గౌరవ కల్నల్ ర్యాం క్‌ను అందించినట్లు వివరించారు. నాగ భూషణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్ తనలభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ర్యాంక్ లభించడం వలన ఎన్‌సీసీ కార్యకలాపాలను నిర్వహించడంలో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. కల్నల్ సంజయ్ గుప్త, గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్‌ఎం. చంద్రశేఖర్, ఇతర గ్రూప్ కమాండర్లు, బెటాలియన్ కమాం డింగ్ ఆఫీసర్లు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

దినసరి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ దినసరి వేతన ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏక గ్రీవంగా ఎన్నికైంది. వికాస అధ్యక్షుడు నీలపు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, సభ్యుల సమక్షంలో మంగళవారం ఈ ఎన్నిక జరిగింది.

20న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డీన్ ఆచార్య ఆర్ శివ రాం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఏఎన్‌యూలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ద అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ)లు సంయుక్తంగా ఈ ప్రోగ్రాం నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు.

నేడు అభినందన సభ

పెదకాకాని, డిసెంబరు 10(అంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సి టీలో పీజీ సెట్ ద్వారా ప్రతి డిపార్టుమెంట్‌లో మొదటి రెండు ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు బుధ వారం అభినందన సభ నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, నవిత పేర్కొ న్నారు. ఉదయం 11 గంట లకు కామర్స్ విభాగంలోని సెమినార్ హాల్‌లో జరుగుతుందని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న ఆటోలు, పట్టుబడిన నిందితులతో ఎస్పీ సతీశ్ కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ, తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు, సీఐ రమేష్ బాబు, సిబ్బంది తదితరులు

ప్రయాణికుల ముసుగులో ఆటోల్లో దోపిడీలు

● రెండు ముఠాలతో సహా పది మంది అరెస్టు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : ప్రయాణికుల ముసు గులో ఆటోలో దోపిడీలకు పాల్పడుతున్న రెండు ముఠాలతో సహా పది మందిని తెనాలి త్రీ టౌన్ పోలీసులు మంగళవార అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 50 వేల నగదు, 15 గ్రాముల బంగారపు నగలు, రెండు ఆటోలు స్వాధీనం చేసు కున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్, సీసీఎస్ అదనపు ఎస్పీ కె సుప్రజ నిందితులను మీడియా ఎదుట హాజరపరచి వివరాలు వెల్లడించారు. గుంటూరు నగరంలోని కొరిటెపాడు నాయుడుపేట రెండవ లైన్‌కు చెందిన పానుగంటి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట్, గుజ్జనగుండ్ల మసీదు సమీపంలోని ఎస్ వి ఎన్ కాలనీ ఒకటవ లైన్ కి చెందిన షేక్ ఖాజా, శివరాంనగర్ మూడో లైన్‌కు చెందిన ముడియాల సుదర్శన్ రెడ్డి అలియాస్ బుడ్డి, నగరంపాలెం ఫోరీల దొడ్డి ప్రాంతానికి చెందిన వాలేరు క్రాంతి, మద్దూరి రమేష్ తదితరులు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో పానుగంటి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట్ ముఠాకు నాయకుడుగా ఉన్నారు. ఆయన పై విజయవాడ సిటీ, గుంటూరు జిల్లాలో 14 చోరీ కేసులు ఉన్నాయి. మరో ముఠాలో నగరంలోని అంకమ్మనగర్ ఆరవలైన్ ప్రాంతానికి చెందిన బడుగు శాంసన్, ఏటి అగ్రహారం ఆరవ లైన్ కు చెందిన ఎలమంచి రామారావు, శ్రీనివాస కాలనీకి చెందిన ఓర్సు వెంకటేష్, అలాగే వెంగళాయపాలెం శ్రీశైలం కాలనీ రోడ్డుకు చెందిన మరో 15 సంవత్సరాల బాలుడు కలసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠాకు శాంసన్ నాయకుడిగా ఉన్నారు. ఆయనపై గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో 16 కేసులు ఉన్నాయి. అదేవిధంగా రామారావు ఆటోలో డ్రైవర్ పక్కన ప్రయాణికుడి మాదిరిగా కూర్చుని నేరం చేస్తుంటాడు. వెంకటేష్ ఆటో డ్రైవర్ గా నేరంలో పాల్గొంటాడు. 15 ఏళ్ల బాలుడు వెనుక సీటులో ప్రయాణికుడి మాదిరిగా కూర్చుని నేరంలో పాల్గొంటాడు. ఈ ముఠా పై ఇప్పటికే తెనాలి ప్రాంతంలో జరిగిన నేరాలకు సంబంధించి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదై ఉన్నాయి. పాత గుంటూరులోని బాలాజీ నగర్ ఒకటో లైన్ కు చెందిన షేక్ కాలేషా ఆటో డ్రైవర్ ముసుగులో ఒంటరిగా ఆటో ఎక్కే ప్రయాణికులను టార్గెట్ చేసి దోపిడీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల తెనాలిలో జరిగిన రెండు దోపిడి నేరాల్లో కాలేషా నిందితుడిగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

నిందితులపై కఠిన చర్యలు... ప్రత్యేక నిఘా..!

తెనాలి కేంద్రంగా ప్రయాణికుల ముసుగులో ఆటోల్లో దూపిడీలకు పాల్పడుతున్న ఆయా ముఠాలకు సంబంధించి పట్టుబడిన 10 మందిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ వెల్ల డించారు. నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తా మన్నారు. వీరందరిపై షీట్లు తెరవడంతో పాటు వారి కదలికలను గమ నిస్తామన్నారు. ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల ముసుగులో జరుగుతున్న వరుస నేరాల నేపథ్యంలో ఆయా నేరాలను కట్టడి చేసేందుకు తిరిగి ఆటోలకు నెంబ రింగ్ విధానాన్ని ప్రారంభించాలని ఎస్పీ నిర్ణయించారు.

బాలికపై యువకుల అత్యాచారం

● నిందితులపై 'పోక్సో' కేసు నమోదు

కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికపై యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మంగళవారం ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని ఒక గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక పదో తరగతి మధ్యలో ఆపి వేసి కొల్లూరులోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. వస్త్రాల కొనుగోలుకు వచ్చిన ఆవులవారిపాలెం క్రీస్తులంకకు చెందిన విప్పర్ల ప్రేమ్‌కుమార్ అలియాస్ విక్కీ అనే యువకుడితో ఆ బాలికకు పరిచయం ఏర్పడింది. గత నెల 26 రాత్రి బాలిక తన గ్రామం వెళ్లేందుకు కొల్లూరు బజారులో వేచి ఉండగా అటువైపు వెళుతున్న యువకుడు, ఇక్కడ ఉన్నావు ఏంటని ఆ బాలికను ప్రశ్నించాడు. ఇంటికి వెళ్లేందుకని ఆమె సమాధానం చెప్పింది. ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద వదిలి పెడతానని చెప్పడంతో నమ్మిన బాలిక ద్విచక్ర వాహనంపై అతనితో వెళ్లింది. తన గ్రామం తీసుకు వెళ్లకుండా దోనేపూడి కరకట్ట వైపు తీసుకు వెళ్లడంతో ఇదేమని ప్రశ్నించగా జవాబు ఇవ్వకుండా నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం తన స్నేహితుడు బెజ్జం శ్యాంబాబు కూడా రావడంతో ఆ యువకుడు కూడా అఘాయిత్యం చేశాడు. ఇన్ని రోజులు భయాందోళనలకు గురైన బాధితురాలు ఈ విషయం చెప్పలేదు. మంగళవారం కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను ఆశ్రయించిన బాలిక, జరిగిన విషయాన్ని వివరించింది. దీనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. నిందితులు ఇరువురు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టభద్రుల దరఖాస్తుల తుది గణాంకాల విడుదల

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదుకు సం బంధించి దరఖాస్తులు, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ పూర్తయింది. సోమవారం అర్ధరాత్రి వరకు దరఖాస్తులను ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో జిల్లా ఎన్నికల అధికారులు స్వీకరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ అనంతరం కొత్తగా ఆరు జిల్లాలు గుంటూరు, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు, కృష్ణ, ఏలూరు నుంచి ఓటరు నమోదు కోసం 64,387 దరఖాస్తులు అందినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్‌ఎస్‌కే ఖాజావలి తెలిపారు. అలాగే ముసాయిదా జాబితాలో చేర్చిన ఓట్లలో 2341పై అభ్యంతరాలు ఫారం-7 ద్వారా అందాయి. ఓటరు చిరునామా మార్పు కోసం ఫారం-8 ద్వారా 1225 దాఖలు అయ్యాయి. మొత్తంగా 67953 క్లెయిమ్‌లు/ అభ్యం తరాలు/ దరఖాస్తులు అందాయని ఈఆర్వో వివరించారు. వీటిని నిర్ణీత గడువు తేదీ లోపు పరిష్కరించి నెలాఖరుకు తుది ఓటర్ల జాబితాలను విడుదల చేస్తామని చెప్పారు.

13న వర్సిటీలో జాతీయ సదస్సు

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఈఐటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య సంధ్యాకోలే మంగళవారం తెలిపారు. ఈ సద స్సును డైక్‌మన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ద రోల్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇన్ ఇన్ స్ట్రుమెంటేషన్' అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా ఎస్‌ఏవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా, కేఆర్ ఫోకస్ ఐఏఎస్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహించారు. పోటీలకు పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలలో యడ్లపల్లి గ్రామం, ఎస్‌ఏవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎస్.కోటేశ్వరరావు హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘ జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు మాట్లాడుతూ పోటీల నుంచి జిల్లా జట్టును ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని అన్నారు. కార్యక్రమంలో పీఈటీ శరత్‌బాబు, కోచ్‌లు నాని, ఆనంద్‌కుమార్, అరుణ్‌కుమార్, సాంబశివరావు, రాజమోహన్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు డిస్ట్రిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన పురుషుల విభాగంలో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు, పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కే.వేణుగోపాలరావు ప్రకటనలో తెలిపారు. గుంటూరు విద్యానగర్‌లోని రూట్ ఫిట్నెస్ సెంటర్‌లో ఈ ఎంపికలు జరుగుతాయని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19వ తేదీన పిఠాపురంలో జరిగే అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 93976 03138 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

చరిత్ర పుటల్లో నిలిచిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మణిహారమై నాగార్జున సాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుగా భారతదేశంలో సగర్వంగా తలెత్తుకునేలా చరిత్ర పుటల్లో నిలుస్తుందని సీనియర్ ఇంజనీర్ ఎస్.సదాశివం అన్నారు. మానవ నిర్మిత మహాద్భుతమైన సాగర్‌కు 70 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ మేధస్సుకు శాస్త్రీయత తోడైతే మహాద్భుతాలు సృష్టించవచ్చని, దానికి అంకితభావం తోడైతే మానవాళికి మహోన్నత మేలు జరుగుతుందని సాగర్ ప్రాజెక్టు నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జనార్ధన్‌రావు, పీటర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శ్యామలా నగర్ ఎక్స్‌టెన్షన్ సాయినగర్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ డీఈఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. అలానే ఏటుకూరు రోడ్డులోని సింహపురి ఎస్టేట్, జగదాంబ ఎస్టేట్, గంగమ్మ ఎస్టేట్, నల్లచెరువు మెయిన్ రోడ్డు, మూడు బొమ్మల సెంటర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నల్లచెరువు ఏఈ శ్రీనివాసరావు మరో ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. మున్సిపల్ సమస్యల పరిష్కారం కొరకు మంగళవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పారిశుధ్య కార్మికులకు రావలసిన బెనిఫిట్స్‌ను అందజేయాలన్నారు. కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోట మాల్యాద్రి, చినబోదుల వెంకట్రావు, వాసు, సద్గుణరావు, శేషమ్మ, మురికిపూడి రమేష్, లక్ష్మి, బుజ్జి, వెంకటేశ్వర్లు, నూనె దానియేలు, బాలమ్మ, రమణమ్మ, మరియదాసు, మరియమ్మ, వీరమ్మ, శంకర్, బాస్కర్, బాలకృష్ణ, నాగ లక్ష్మి సువార్తమ్మ, ఝాన్సీ, వీరయ్య పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాడిన యోధుడు జీవీ కృష్ణారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసంఘటిత రంగంలోని కార్మిక వర్గ ప్రయోజనాల కోసం అనేక పోరాటాలు చేసిన యోధుడు జీవీ కృష్ణారావు అని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి కొనియాడారు. స్థానిక ఏటుకూరు రోడ్డు, రేగుల రాఘవయ్య భవన్ వద్ద జీవీ కృష్ణారావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హమాలీ ముఠా ఫెడరేషన్‌ని ఏర్పాటు చేసి అసంఘటిత రంగంలోని కార్మికులను ఏకతాటిపై నడిపించిన ఘనత జీవీ కృష్ణారావుకే దక్కుతుందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘంతో పాటు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయటంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. జీవీ కృష్ణారావు ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి సురేష్ బాబు, రావుల అంజిబాబు, అమ్మిశెట్టి శివ, జి.సుధాకర్, పోనుగోటి వెంకటరెడ్డి, ముసల లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ముగిసిన జాబ్‌మేళా

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. విజయవాడకు చెందిన డ్రాగో డ్రోన్స్ జాబ్‌మేళాలో పాల్గొన్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. జాబ్‌మేళాలో మొత్తం 104 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిజె జెస్సీ, డీఆర్‌డీఏ పీడీ టివి విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ప్రిన్సిపల్ శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు వేశారు... మార్జిన్లు మరిచారు



ఎన్జీవో కాలనీ ఎస్‌కేబీపీఎం స్కూల్ వద్ద రోడ్డు మార్జిన్



బిల్డింగ్ వ్యర్థాలను రోడ్డు మార్జిన్‌లో పోసిన చిత్రం

● ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు

ఎన్జీవోకాలనీ(గుంటూరు విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీలో మొదటి లైను నుంచి నల్లకుంట సబ్‌స్టేషన్ వరకు ఉన్న మెయిన్ రోడ్డును ఇటీవల నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా సిమెంటు రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణం పూర్తయి రెండు నెలలైనా రోడ్డుకు ఇరువైపులా మట్టితో చదును చేయలేదు. ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో చదును చేయని రోడ్డు మార్జిన్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు సంస్థకు ఈ విషయం తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల బిల్డింగ్ వ్యర్థాలు రోడ్డుకు ఇరువైపులా పోసి వదిలేశారు. మరికొన్ని చోట్ల రోడ్డు మార్జిన్లు వదిలేశారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా మట్టితో చదును చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమన్వయంతో పని చేయాలి : కమిషనర్



పైపులైన్ షిఫ్టింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని మూడు వంతెనల దగ్గర రైల్వే శాఖ చేపడుతున్న నూతన వంతెన పనుల్లో భాగంగా జీఎంసీ తాగునీటి పైప్‌లైన్ షిఫ్ట్ చేయడానికి సదరు రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు జీఎంసీ ఈఈని ఆదేశించారు. మూడు వంతెనల దగ్గర జరుగుతున్న రైల్వే వంతెన పనులు, షిఫ్ట్ చేయాల్సిన పైప్ లైన్‌ను మంగళవారం ఆయన పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు సంయుక్త పర్యటన చేసి, పైప్ లైన్ షిఫ్ట్‌కి అవసరమైన ఖర్చులను రైల్వే శాఖ నుంచి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. అలాగే వంతెన పనులు పూర్తయ్యాక సదరు ప్రాంతంలో రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు, ఏఈ నాగవేణి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిషేధ కమిటీ యాక్టివ్‌గా ఉండాలి

● జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి విజయ్ కుమార్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిషేధ పర్యవేక్షణ కమిటీలు యాక్టివ్‌గా ఉండాలని, జీఎంసీ పరిధిలో ఒక్క బాల్య వివాహం కూడా జరగడానికి వీలు లేదని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ విజయ్ కుమార్ అన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డుల వారీగా నియమించిన బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీలకు బాల్య వివాహ నిషేధ చట్టం-2006, రూల్స్ 2023 పై అవగాహన శిబిరం నిర్వహించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మాట్లాడుతూ అన్ని సచివాలయాలు, సంస్థల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ 100, ఉమెన్ హెల్ప్ లైన్ 181, ఈఆర్ఎస్ఎస్ 112 నంబర్లను డిస్‌ప్లే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా వారోత్సవాలు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహనా వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థల్లో అవగాహనా సదస్సులు, ర్యాలీలు జరిగాయి. ఆయా సదస్సుల్లో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, ఎప్పటికప్పుడు మోసగాళ్ళు అవలంబిస్తున్న కొత్త విధానాలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో బాగంగా ట్రెయినీ ఐపీఎస్ దీక్షా, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌ల పర్యవేక్షణలో కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా కళాశాల, ఏసీ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం ఉమెన్స్ కళాశాల, నాజ్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు.

● లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చలమయ్య కళాశాలలో సీఐ శివప్రసాద్ ఆధ్వ ర్యంలో సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం కళాశాల నుంచి హిమని సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. హిమనీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

● నల్లపాడు స్టేషన్ పరిధిలోని పలకలూరురోడ్డులో గల విజ్ఞాన్ నిరులా కళాశాల విద్యా ర్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. కళాశాల నుంచి గుజ్జనగుండ్ల వరకు ఈ ర్యాలీ సాగింది. సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో సైబర్ నేరాలకు సంబంధించిన మోసాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

నేటి నుంచి పోలీస్ స్పోర్ట్స్ మీట్

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్ బుధవారం నుంచి ప్రారంభం కాబోతోంది. బుధవారం ఉదయం పోలీస్ పేరెడ్ గ్రౌండ్స్‌లో స్పోర్ట్స్ మీట్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి అధికారుల వరకు ఆయా పోటీల్లో పాల్గొంటారు. పరుగు పోటీలు, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, త్రో బాల్, కబడ్డీ, టెన్నిస్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తారు. ఆయా పోటీలు మూడు రోజులు పాటు జరుగుతాయి. జిల్లా స్థాయిలో విజేతలైన క్రీడాకారులు, జట్లు ఆ తరువాత జరగనున్న రేంజ్ పోటీల్లో తలపడనున్నారు. ఆ తరువాత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయా పోటీలు జరగనున్నాయి.

నిత్యం శారీరక, మానసిక ఒత్తిడితో సతమతమయ్యే పోలీసుల్లో మానసిక, శారీరక ఉల్లాసం కోసం ప్రతి ఏటా పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించే వారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారి మాత్రమే ఆయా పోటీలు నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి స్పోర్ట్స్ మీట్ ప్రారంభం కావడంపై పోలీస్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలు కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లు మాయం

● ఆయా కేసుల్లో సాక్ష్యం చెప్పడానికి వచ్చిన ఎస్ఐను ప్రశ్నించిన మేజిస్ట్రేట్
● తీసుకువస్తానని చెప్పి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకుని అదృశ్యమైన ఎస్ఐ

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో పోలీసులు సీజ్ చేసిన మద్యం బాటిళ్లు అదృశ్యమయ్యాయి. కోవిడ్ సమయంలోనూ, ఆ తరువాత పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బార్లపై అరండల్‌పేట పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేయడమే కాకుండా మద్యం బాటిళ్ళను సీజ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి అరండల్‌పేట ఎస్ఐ ప్రవీణ్ అరండల్‌పేట ఒకటో లైన్‌లోని బార్‌లో రూ.17,200 నగదు సీజ్ చేశారు. అదేవిధంగా శారద కాలనీలో, మరొక రెండు కేసుల్లో కూడా మద్యం బాటిల్స్ సీజ్ చేశారు. చట్ట ప్రకారం సీజ్ చేసిన ఆయా బాటిల్స్‌ను కోర్టుకు హాజరు పరచడం గానీ లేదంటే పోలీస్‌స్టేషన్లో భద్రపరచడం గాని చేయాలి. అయితే ఈ నాలుగు కేసులు గుంటూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చాయి. ఆయా కేసుల్లో అప్పటి ఎస్ఐ ప్రవీణ్ విచారణ అధికారిగా ఉన్నారు. ఈ మేరకు మంగళవారం కోర్టులో రెండు కేసుల్లో సాక్ష్యం చెప్పేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయా కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లను తీసుకురావాలని మెజిస్ట్రేట్ స్పందన కోరారు. మద్యం బాటిల్స్ స్టేషన్లో ఉన్నాయని తీసుకొస్తానని బయటకు వచ్చిన ఎస్ఐ ప్రవీణ్ ఆ తర్వాత సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని మాయమయ్యారు. ఎంతకు ఎస్ఐ ప్రవీణ్ హాజరుకాకపోవడంతో మెజిస్ట్రేట్ ఆయా కేసుల్లో దాడుల్లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది మొత్తాన్ని పిలిపించారు. సీజ్ చేసిన ఆయా మద్యం బాటిల్స్ గురించి మేజిస్ట్రేట్ ప్రశ్నించడంతో ఏఎస్ఐ తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తీసుకొస్తానని వెళ్ళాడు. అయితే సీజ్ చేసిన మద్యం బాటిల్స్ పోలీస్‌స్టేషన్లో లేక పోవడంతో వెను తిరిగి వచ్చి అదే విషయాన్ని మేజిస్ట్రేట్‌కు చెప్పాడు. దీంతో కేసును వచ్చే నెల మూడో వారానికి వాయిదా వేశారు. ప్రస్తుతం ఎస్ఐ ప్రవీణ్ బెల్లంకొండ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కొడుకుపై హత్యాయత్నం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువు రామాలయం ప్రాంతానికి చెందిన శ్యాంసన్ అనే వ్యక్తి తన కుమారుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదనే కారణంతో కొడుకుపై దాడికి పాల్పడ్డాడు. శ్యాంసన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బీటెక్ పూర్తి చేశాడు. చాలా కాలం వరకు ఆయన మెడికల్ షాప్‌లో పని చేశాడు. అయితే ఇటీవల ఆరోగ్యం దెబ్బతినడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఏ పని చేయకుండా మద్యానికి బానిసైన తండ్రి శ్యాంసన్ తాగి వచ్చినప్పుడల్లా భార్య, పిల్లలను కొడుతుండేవాడు. మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కారణంతో మంగళవారం మధ్యాహ్నం పెద్ద కుమారుడిపై కత్తితో దాడి చేశాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు శ్యాంసన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పురస్కారం అందజేస్తున్న డాక్టర్ మంగాదేవి తదితరులు

ఘనంగా లలిత కళా ఉత్సవం

● ముగ్గురు ప్రముఖులకు సాహిత్య పురస్కారం

గుంటూరు(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ ఆధ్వర్యంలో 26వ లలిత కళా సంగీతోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఏటీ అగ్రహారం జీరోలైనులోని ఎంఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమానికి వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు అధ్యక్షత వహించారు. తొలుత జ్యోతిప్రజ్వలన అనంతరం దివంగత ప్రభావతి చిత్రపటానికి డాక్టర్ మంగాదేవి, ఇతర అతిథులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. లలితకళా ఉత్సవంలో భాగంగా మంగాదేవి బాల సాహిత్య పురస్కారాన్ని కె.సురేష్, పి.భాగ్యలక్ష్మిలకు అందించారు. ఇందులో భాగంగా రూ.25,000, జ్ఞాపికను అందజేశారు. మాలతీ ప్రమదా సాహితీ పురస్కారాన్ని దేవనపల్లి వీణావాణి అందించారు. ఆమెకు రూ.25,000, జ్ఞాపికను అందించారు. అదే విధంగా ప్రతిభా పల్లవం పురస్కారాన్ని పోలవరపు సాధ్యకు అందించారు. ఆమెకు రూ.10,000 జ్ఞాపికను అందించారు. ముఖ్య అతిథులు ఆచార్య బాలమోహన్‌దాస్, ఎం.కృష్ణకుమారి, వాడరేవు చినవీరభద్రుడు తదితరులు మాట్లాడుతూ బాలల్లో సృజనాత్మక శక్తిని పుస్తకాల ద్వారా పెంచాలని, వారి భవిష్యత్తును వారే నిర్ణయించుకునే అవకాశం పిల్లలకు ఉండాలన్నారు. రాష్ట్రస్థాయి సంగీత, సాహిత్య పోటీలను నిర్వహించి విజేతలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర మంగాదేవి స్వీయ కథ అంకురం నుంచి అనంతం వరకు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని బాలకుటీర్ సహకార్య దర్శి జయశ్రీ, సీఏఓ రఘురాం, చేతన నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జీవన సంఘర్షణే... 'పడమటి గాలి'

● వ్యాసాల పుస్తకావిష్కరణ సభలో పలువురు వక్తలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవితం కేంద్రంగా సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి, జీవన సంక్షోభాన్ని, సంఘర్షణను వాస్తవికంగా పడమటి గాలిని నాటకరూపంలో దృశ్యమానంగా చేశారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నమయ్య కళావేదికపై పడమటి గాలి నాటకంపై ప్రముఖ రచయిత దివికుమార్ రచించిన వ్యాసాల సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, నాటకరంగ పరిశోధకుడు కందిమళ్ళ సాంబశివరావు, ప్రముఖ నటుడు, రచయిత నాయుడు గోపి తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద సంవత్సరాల నాటి సమాజ స్వరూపానికి దర్పణం కన్యాశుల్కమైతే, వర్తమాన సమాజ విచిత్ర వికృత పోకడలకు నిలువుటద్దం పడమటి గాలి అని అన్నారు. కార్యక్రమంలో సాహితివేత్త సత్యనారాయణ, పలువురు ప్రముఖులు పాల్గొన్ని రచయిత దివికుమార్‌ను అభినందించారు. కార్యక్రమాన్ని ఉన్నం వెంకట శేషయ్య నిర్వహించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దొక్కా మాణిక్యవరప్రసాదు, గుమ్మళ్ల బలరామయ్య తదితరులు

రైతుల జీవిత దర్పణం.. పడమటి గాలి

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై పండు క్రియేషన్స్ కొప్పోలు (ఒంగోలు) వారి నాటకోత్సవాలలో భాగంగా రచన డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు, గుమ్మళ్ళ బలరామయ్య దర్శకత్వం వహించిన పడమటి గాలి నాటకాన్ని ప్రదర్శించారు. నాటకంలో భార్యాభర్తల అనుబంధాన్ని, కన్నవాళ్లకూ బిడ్డలకూ మధ్య మమకారాన్ని ధ్వంసం చేస్తున్న ఆర్థిక సంబంధాలూ, రైతు కూలీని రైతుకు దూరం చేస్తున్న విషాదాలూ, రైతుకు ప్రాణాధారమైన భూమిని తనకి కాకుండా చేయాలన్న బడాబాబుల కుట్రలు, అనైతిక శారీరక సంబంధాలు, కట్నాల కోసం వెంపర్లాటలు, అమెరికా వ్యామోహాలు, మనిషి జీవితాన్ని కలుషితం చేస్తున్న విషాదాలు వంటి దృశ్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

కౌశల్ 2024 పోటీల్లో రాష్ట్ర స్థాయికి 12 మంది ఎంపిక

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న జరిగిన కౌశల్ 2024 పోటీల విజేతల వివరాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 29, 30 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తారని ఆమె వెల్లడించారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇలా.. కౌశల్-2024 జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో చింతా ఉమిక, (జడ్పీహెచ్ఎస్, అబ్బినేనిగుంటపాలెం), తోటకూర జ్ఞాన దీపిక, (జడ్పీహెచ్ఎస్, ముట్లూరు), బడే అవంతిక అన్నపూర్ణ, (జడ్పీహెచ్ఎస్, ముట్లూరు,) నిలిచారు. ద్వితీయ స్థానంలో వడ్డే వెంకట సాయి, (జడ్పీహెచ్ఎస్, నల్లపాడు), కొణిదల నందిని, (జడ్పీహెచ్ఎస్, కాట్రపాడు), కుక్కమళ్ళ ఆదర్శ్, (జడ్పీహెచ్ఎస్, జొన్నలగడ్డ) ఉన్నారు. 8వ తరగతి విభాగం పోస్టర్-1లో ప్రథమ, ద్వితీయ స్థానాలను నేలటూరి సుస్మిత (జడ్పీహెచ్ఎస్, ముట్లూరు), నందు మోక్షిత (జడ్పీహెచ్ఎస్, ముట్లూరు), 9వ తరగతి విభాగంలో పోస్టర్-2లో ప్రథమ, ద్వితీయ స్థానాలను ఎద్దు చంద్రిక (జడ్పీహెచ్ఎస్, కాట్రపాడు), షేక్ రషీద్ జోయ్, (జడ్పీహెచ్ఎస్, అంకిరెడ్డి పాలెం), పదవ తరగతిలో ప్రథమ స్థానం అడుసుమల్లి లక్ష్మీ నాగ సాయి సుతిక్షణ, (జడ్పీహెచ్ఎస్ గర్ల్స్, పొన్నూరు), ద్వితీయ స్థానం పాల జ్యోతి నాగమణి (జడ్పీహెచ్ఎస్, ముట్లూరు) సాధించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి ప్రథమ స్థానం రూ.1500, ద్వితీయ స్థానం విద్యార్థులకు రూ.1000 చొప్పున అందజేస్తామని కౌశల్ జిల్లా కో ఆర్డినేటర్ మన్నవ సురేష్ కుమార్ తెలిపారు.

పాలస్తీనా సంఘీభావ సభ విజయవంతం చేయాలి : పీడీఎస్‌వో

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌వో, ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో ఈనెల 12న జరిగే పాలస్తీనా సంఘీభావ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే బాషా విజ్ఞప్తి చేశారు. జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అరండల్‌పేట వైన్ డీలర్స్ కళ్యాణమండపంలో జరిగే సమావేశానికి ఆచార్య బి.జమిందార్, కొత్తపల్లి రవిబాబు, షేక్ జిలానీ, స్త్రీ విముక్తి సంఘటన అధ్యక్షులు డాక్టర్ సి.విజయ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు కలిగి ఉన్న పశ్చిమాసియాదేశాలపై పట్టు కోసం ఇజ్రాయేల్‌ను అమెరికా సృష్టించిందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కోశాధికారి ఎల్.బాను, ఎన్‌వైఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీను, వి.విశ్వతేజ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల విషయంలో నిర్లక్ష్యం తగదు!

● అధికారులకు ఎమ్మెల్యే గళ్లా మాధవి హెచ్చరిక



అభివృద్ధి పనులపై సెల్‌ఫోన్ ద్వారా వివరాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హెచ్చరించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం ఆమె సమీక్షించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 'మీతోనే నేను-మీ వెంటే నేను' కార్యక్రమం ద్వారా అభివృద్ధికి నోచుకోని డివిజన్లపై దృష్టి పెట్టి, కనీస మౌళిక సదుపాయాలైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యలు పూర్తిగా తొలగించటానికి పలు డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆమె ఆరా తీశారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి అభివృద్ధి పనుల ప్రగతిపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలలో రాజీ పడే ప్రసక్తే లేదని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఖాళీ స్థలాల విషయంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంలో అక్రమార్కులకు శిక్ష తప్పదు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్



డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అక్రమార్కులకు శిక్షలు తప్పవని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు ఇటీవల కాకినాడ పోర్టులో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారని తెలిపారు. అదేవిధంగా విశాఖపట్నంలో నాదెండ్ల మనోహర్ అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుని అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారని చెప్పారు. ఈ ప్రభుత్వంలో అక్రమార్కులకు అరదండాలు తప్పవని అన్నారు. ప్రజలకు సంక్షేమం అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పని చేస్తున్నారని తెలిపారు. అటువంటి ముఖ్యమంత్రిపై ఎంపీ విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సాయిరెడ్డి ఇప్పుడు కూడా తాము అధికారంలో ఉన్నామని భ్రమలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. విజయ్‌సాయిరెడ్డి తన పద్ధతి మార్చుకోవాలని కత్తెర సురేష్ కుమార్ సూచించారు. దశల వారీగా కూటమి ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలు, పేదల అభివృద్ధే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు.

గ్రామాల పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యం

● జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



క్లాప్ మిత్ర సిబ్బందిని సన్మానిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. స్వచ్ఛత భారత్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి అధ్యక్షత వహించారు. ఛైర్‌పర్సన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గ్రామాలు అభివృద్ధి చెందిన నాడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్లాప్ మిత్ర సిబ్బందిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, జిల్లా పంచాయతీ ఆఫీసర్ బీవీఎస్ సాయికుమార్, హౌసింగ్ పీడీ జేవీఎస్ఆర్‌వీ ప్రసాద్, స్వచ్ఛ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు మాట్లాడారు. గ్రామీణ నీటి పారుదల పారిశుధ్య శాఖ జిల్లా కో ఆర్డినేటర్లు షేక్ షఫీ, జి.సాయికుమార్ పాల్గొన్నారు.

మైనార్టీలకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలి

● ప్రభుత్వ సలహాదారు మహమద్ షరీఫ్‌కు వినతి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో మైనార్టీలకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి కోరారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమద్ షరీఫ్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఖాజావలి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మైనార్టీలు అధికంగా ఉన్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని అమరావతిలో మెడికల్ కళాశాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువస్తామని షరీఫ్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీ జే పీ మైనార్టీ మోర్చా నాయకుడు ఎస్‌ఎం భాషా ఉన్నారు.

హిందూ ఫార్మసీ విద్యార్థుల విజ్ఞాన యాత్ర

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులో గల హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఫార్మా సూటికల్ ఎనాలిసిస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పేరేచర్లలోని జోసిల్ పరిశ్రమను సందర్శించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఎం. ఫార్మసీ మొదటి సంవత్సరం, డి.ఫార్మసి రెండవ సంవత్సరం, ఫార్మా.డి. మూడవ సంవత్సరం విద్యార్థులు మొత్తం 60 మంది పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి సీతారామయ్య, డాక్టర్ పి.నాగరాజు, వి. సుధారాణి పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్ పాఠశాలకు పుస్తకాలు అందజేత

గుంటూరు సిటీ, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని రామకృష్ణ మిషన్ పాఠశాల విద్యార్థులకు జనరల్ నాలెడ్జి, స్వాతంత్ర్య సమర యోధులకు చెందిన పుస్తకాలను విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఇదే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడికొండ మండలం బడేపురం ఎస్సీ కాలనీ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ రిటైర్డ్ సూపరింటెండెంట్ వీబీ ప్రసాద లింగం, మహిళా, శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎంఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ రచనలు చేసిన నటరాజన్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్టుకతో తమిళుడైన నటరాజన్ తెలుగు సాహిత్య రంగంలో శారద పేరుతో అపూర్వ రచనలు చేశారని ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ ప్రశంసించారు. స్థానిక ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో అరసం ఆధ్వర్యంలో శారద శత జయంతి సభ నిర్వహించారు. సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి కే.శరత్ అధ్యక్షత వహించారు. దయానంద్ మాట్లాడుతూ ఏడేళ్ల కాలంలోనే వంద కథలు, అరడజనుకు పైగా నవలు రాసిన గొప్ప సాహితీవేత్త శారద అని కొనియాడారు. శరత్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో శారద ధృవతారని అన్నారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్ బీఈడీ కళాశాల అధ్యాపకుడికి పీహెచ్‌డీ

గుంటూరు(విద్య),డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రా లూథరన్ బీఈడీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న వడ్డే శేఖర్‌బాబుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగం పీహెచ్‌డీ ప్రదానం చేసిందని ప్రిన్సిపల్ ఆచార్య మాదాసు ఏస్తేరు సునీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శేఖర్‌బాబును ప్రిన్సిపల్ ఆచార్య మాదాసు ఏస్తేరుసునీల, అధ్యాపకులు అభినందించారు.

డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రం

- పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పీ నారాయణ
- త్వరలో మరో ఐదు జిల్లాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు
- పల్నాడు జిల్లాలోని జిందాల్ ప్లాంట్ పరిశీలన



వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వింటున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పుల్లారావు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారా వచ్చే ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2) నాటికి డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు పంచాయతీలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని మంత్రి నారాయణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురంలలో కూడా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014-19 మధ్యలో ఘన వ్యర్థాల నిర్వహణపై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలతో రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టామన్నారు.

వైసీపీ అసమర్థ నిర్వహణ ...

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యర్థాల అసమర్థ నిర్వహణ వల్ల రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే ఆ వ్యర్థాలను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, విశాఖలోని జిందాల్ ప్లాంట్లలో 2,160 టన్నుల వ్యర్థాలను(31 శాతం) ట్రీట్మెంట్ చేస్తున్నారని తెలిపారు. ఆ ప్లాంట్ల ఏర్పాటుతో 50 నుంచి 60 కిలోమీటర్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయతీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా వ్యర్థాల ద్వారా గంటకు 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, రోజుకి 12 వందల టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసే జిందాల్ ప్లాంట్ ఏర్పాటు సీఎం చంద్రబాబు దార్శనికతకు తార్కాణమన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిందాల్ ఏపీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఎంవీ చారి పాల్గొన్నారు.

శిథిలావస్థలో సంక్షేమ భవన్

పెచ్చులూడుతున్న శ్లాబ్.. పడిపోతున్న గోడలు.. ఇనుప చువ్వలు బయట పడి ప్రమాద స్థితిలో ఉన్న పిల్లర్స్.. పగుళ్లతో ఎప్పుడు కూలుతుందో తెలియని కారిడార్.. ఇదీ జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ దుస్థితి. జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న సంక్షేమ భవన్‌లో సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల కార్యాలయాలు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఈ భవనం కనీస మరమ్మతులకు సైతం నోచుకోలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఒక పక్క అధికారులు, సిబ్బంది, మరోపక్క ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.





- పెచ్చులూడుతున్న శ్లాబ్.. మొదటి అంతస్తు ఖాళీ
- ఇప్పటికే కొన్ని కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోకి...
- ఐదేళ్లల్లో పైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం



గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని జీటీ రోడ్డు నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్ కార్యాలయంలో వెనుక దాదాపు ఐదు దశాబ్దాల క్రితం సంక్షేమ భవన్ కార్యాలయాలను నిర్మించారు. గడిచిన కాలంలో సంక్షేమ భవన్ నిర్మాణాలు పూర్తిగా శిథిలమవుతూ ఉన్నాయి. ప్రస్తుతం మరింత ప్రమాదకరంగానూ మారాయి. కార్యాలయాల నిర్వహణ సరిగా లేకపోవడంతో మొదటి అంతస్తు స్లాబ్ పెచ్చులుగా ఊడిపోవడం, గోడలకు పగుళ్ళ వచ్చాయి. దీంతో అక్కడ బీసీ కార్పొరేషన్, ఇంజనీరింగ్ విభాగం, రెసిడెన్సియల్ స్కూల్ సోసైటీ కార్యాలయాలను ప్రైవేటు భవనాల్లోకి తరలించారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని మాత్రం ఇదే భవనంలో ఉన్న సమావేశ మందిరంలో కొనసాగిస్తున్నారు.

అద్దెల కట్టలేక శిథిల భవనంలోనే...

సంక్షేమభవన్‌లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగుల కోసం కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. దీంతో కార్యాలయాలకు ప్రవేటు భవనాల కోసం వేట ప్రారంభించారు. నగరంలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను అద్దెకి ఇవ్వడానికి ప్రైవేటు వ్యక్తులు ముందుకు రాని పరిస్థితి ఉంది. చివరకు ఎట్టకేలకు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని బ్రాడీపేటలోని ఒక ప్రైవేటు భవనంలోకి మార్చారు. అక్కడ నెలనెల అద్దెలు భరించలేక కార్యాలయం ఆవరణలో ఉన్న సమావేశ మందిరంలోకి తిరిగి వచ్చేశారు. సాంఘిక శాఖ సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు బయట అద్దెలు భరించలేక ఈ శిథిల భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగిస్తున్నామని పేరుచెప్పని ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంక్షేమ భవన్ కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించడమా? లేక ఉన్న భవనాలకు మరమ్మతులు చేయించడమా? అనే విషయాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బీసీ కార్పొరేషన్ చాంబర్ వద్ద పెచ్చులూడుతున్న స్లాబ్



ఖాళీ అయిన ఇంజనీరింగ్, బీసీ కార్పొరేషన్ ఈడీ చాంబర్స్

మరమ్మతుల గురించి పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు, టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో కార్యాలయాలకు కార్పొరేట్ హంగులు కల్పించారు. ప్రత్యేక చాంబర్లు, సిటింగ్ కోసం ఆధునిక కుర్చీలు, కంప్యూటర్ డెస్కులు, అధికారుల గదులకు ప్రత్యేక సిలింగ్‌తో కూడిన నిర్మాణాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కార్పొరేట్ హంగులతో తయారైన తొలి భవనం ఇదే. అయితే గడిచిన అయిదేళ్లలో సంక్షేమ భవనంలోని కార్యాలయాలు మరింత ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం కొన్ని చాంబర్స్‌లోకి వర్షపు నీరు వస్తోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

45 రకాల జబ్బులకు 'బాల సురక్ష'లో ఉచిత వైద్యం

- ఆరోగ్యరక్ష వాహనం ప్రారంభించిన కలెక్టర్ నాగలక్ష్మీ
- సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



వాహనం ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

గుంటూరు మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికల్లో కనిపించే పలు రకాల రుగ్మతలను ముందుగానే గుర్తించి తగిన చికిత్సలు అందించేందుకు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో (ఆర్‌బీఎస్‌కే) అమలు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ చేసి తదుపరి చికిత్సల సిఫార్సు చేసిన పిల్లలను గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి చేరవేసుందుకు ప్రభుత్వం కేటాయించిన బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ శిశువులు, పిల్లల్లో 45 రకాల జబ్బులను గుర్తించి జిల్లా సత్వర చికిత్సకేంద్రంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. క్లబ్‌ఫుట్ (వంకర పాదాలు), క్యాటరాక్ట్, వినికిడి లోపాలు, గ్రహణం మొర్రి, నాడీవ్యవస్థ లోపాలు, రక్తహీనత, పోషకాహార లోపం, చర్మ వ్యాధులు, గుండె వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, మూర్ఛ వంటి పలు రకాల జబ్బులకు జిల్లా సత్వర చికిత్సకేంద్రంలో ఉచితంగా వైద్యసేవలు లభిస్తాయని వెల్లడించారు. ఈసేవలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మీ కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ, డీఐవో డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ లక్ష్మానాయక్, డెమో ఏ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రేవుల్లో ఇష్టారాజ్యం



- రౌడీల బెదిరింపు.. పాటదారుడు పరారీ
- అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో విజిలెన్స్ తనిఖీలు
- 9 జేసీబీలు, 3 లారీలు, 360 టన్నుల ఇసుక స్వాధీనం

గుంటూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇసుక రేవుల్లో పాటదారుడు లేడు.. అయితే స్థానికంగా చక్రం తిప్పే వ్యక్తులు.. వారు నియమించిన రౌడీ మూకలదే రాజ్యం. రౌడీల దెబ్బకు పాటదారుడు ఎప్పుడో పరారయ్యాడు. ఇసుక తవ్వకాలు జరిపేదంతా రౌడీమూకలే. అనుమతి లేకుండా.. నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి.. భారీ యంత్రాలతో నదీ గర్భంలో ఇసుకను తవ్వి తీసి జేబులు నింపుకుంటున్నారు. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది రీచ్‌లోకి బయట వాళ్లను రానిచ్చే పరిస్థితి లేదని కొన్ని చోట్ల యువకులను కాపలా పెట్టి మరీ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ప్రభుత్వానికి, విజిలెన్స్ డీజీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం విజిలెన్స్, మైనింగ్ అధికారులు పరిశీలించి అక్కడ పరిస్థితిని చూసి ముక్కున వేలేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలు ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. నదీ గర్భంలోకి వెళ్లి ఇసుకను తవ్వి తీస్తున్నారని, జేసీబీ, ఎక్స్‌కవేటర్లను వినియోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. లారీలను నదిలోకి తీసుకువెళ్తున్నారని తేల్చారు. ఈ క్రమంలో రీచ్‌ల్లో 9 జేసీబీ, ఎక్స్‌కవేటర్లు, మూడు లారీలు, 360 టన్నులు ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేట, అమరావతి పోలీసు స్టేషన్లలో విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని చెప్పారు.

విజయవాడ వ్యక్తి...?

అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో జరుగుతున్న ఇసుక దందా అంతా విజయవాడకు చెందిన వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. అసలు ఆ వ్యక్తికి ప్రభుత్వ అనుమతి ఉందా.. లేదా అన్న విషయం తేల్చడం మైనింగ్ అధికారుల వల్ల కూడా కాలేదు. మైనింగ్ శాఖ రికార్డుల ప్రకారం ఆయా రీచ్‌ల్లో ఎవరికీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అనుమతులు ఉన్నట్లుగానే భారీ యంత్రాలతో ఇసుకను తవ్వుతున్నారు. అధికారుల రాకను గమనించి ఇసుక తవ్వి స్తున్న వాళ్ళు పరారయ్యారు. అధికారులు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడే ఉన్నా ఏ ఒక్కరు కూడా వచ్చి తమకు అనుమతి ఉందని వచ్చి చెప్పలేదని సమాచారం. అప్పటి నుంచి ఎంత మేరకు ఇసుక తవ్వి తీశారో అధికారులు లెక్కలు వేయిస్తున్నారు.



అంబడిపూడి ఇసుక రీచ్ లో భారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ ఎస్పీ డీ సూర్య శ్రావణ్ కుమార్

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆర్.ఎస్.కెలు పరీక్షించినా మిల్లర్లు ససేమిరా అంటున్నారు. ఆ శాతాలను పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ సొంతగా తేమ పరీక్షిస్తున్నారు. ఆర్.ఎస్.కెలో నిర్ధారించిన దానికంటే కొన్ని మిల్లుల్లో 3 నుంచి 5 శాతం అదనంగా చూపిస్తున్నారు. తేమ పరీక్షించే పరికరంలో కప్పు కొలత మేరకే పొయ్యాల్సి ఉంటే, అంతకుమించి పొయడంతో తేమ శాతం కూడా అదనంగా చూపిస్తోంది. దీంతో అదనంగా వచ్చిన తేమకు సరిపడా తరుగు కింద తీసేస్తున్నారు. మళ్లీ పరీక్షలపై రైతులు ప్రశ్నిస్తుంటే బస్తాకు రూ. 50 నుంచి రూ.100 తీసుకుని ఆర్.ఎస్.కేల్లో అడిగినంత తక్కువ తేమ శాతం వేసిస్తున్నారని, అందుకే తాము పరిశీలించుకుంటున్నామని మిల్లర్లు దబాయిస్తున్నారు. తేమ శాతం ఒక్కో పాయింట్‌కు రూ.20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారు. వరి నూర్పిళ్ల యంత్రాలతో చేస్తున్నందున తేమ శాతం ఎక్కువగా ఉంటున్నది. తేమ శాతం ప్రభుత్వం చెబుతున్నట్టు 17 శాతమే ఉండాలంటే 10 నుంచి 15 రోజులు ఆరబెట్టాలి. చేలల్లో ధాన్యం ఆరబెట్టే పరిస్థితులు లేవు. పొలం నుంచి ధాన్యాన్ని కేంద్రానికి తీసుకు రావడానికి బస్తాకు రూ.100 ఖర్చు అధికంగా అవుతున్నది. 40 కిలోల గోతానికి రూ.3.39 ధరను అధికారులు నిర్ణయించారు. అయితే ఈ ధరకు గోతం కొనే పరిస్థితి లేదు. 75 కిలోల గోతం ధర రూ.20 నుంచి 30 వరకు ఉంది. హమాలీ కూలీ క్వింటాకు రూ.25గా నిర్ణయించారు. రవాణా చార్జీలు స్థానికంగా ఎక్కడికక్కడ నిర్ణయించనున్నారు. అయితే ఇవేవీ అమలు కావడంలేదు. దీంతో రైతులు అయినకాడికి అమ్మేసుకుంటున్నారు. రాబోయే రెండు మూడు వారాల్లోనే లక్ష్యం వరకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ తర్వాత ఏమిటన్న దానిపై అధికారుల్లో స్పష్టత కొరవడింది. సరైన ప్రణాళికలు లేని కారణంగానే ధాన్యం సేకరణ విషయంలో రైతులు అగచాట్లు పడుతున్నారు. గతంలో మిల్లరు ధాన్యం సేకరణ కోసం పోటీ పడేవారు. ఈ దఫా ప్రభుత్వం తేమ శాతం నిబంధనల విషయంలో సడలింపులు ఇవ్వడంతో భవిష్యత్తులో సీఎంఆర్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న మిల్లర్లు తాము బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మేరకు సేకరించి మిన్నకుండిపోతున్నారని సమాచారం.



బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందంటూ..

రైతు వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ లేదా ఆర్.ఎస్.కెలకు వెళ్లి ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి మిల్లు అనుమతి తీసుకోవాలి. అయితే మిల్లులు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే వాటికి బ్యాంక్ గ్యారెంటీ అవసరం ఉంటుంది. తుఫాన్ సమయంలో భారీగా ధాన్యం కొనుగోలుతో చాలా మిల్లులకు బ్యాంకులకు గ్యారెంటీ పరిమితి దాటిపోయింది. కొనుగోళ్లకు ఇబ్బందులు రాకుండా మిల్లులకు 1:1 నిష్పత్తిలో కాకుండా 1:2 నిష్పత్తిలో కూడా ప్రభుత్వం అనుమతులిచ్చింది. అయితే ఈ అవకాశాన్ని వారు రైతులకు వినియోగించకుండా దళారుల నుంచి ధాన్యాన్ని కొనడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందని, రెండు రోజుల్లో వస్తుందని, వచ్చాకే ధాన్యం కొనగలమని చెప్తున్న మిల్లర్లు దళారుల నుంచి మాత్రం లారీలకు లారీల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాకు ఇన్‌చార్జి అధికారే దిక్కు..

జిల్లాలో కీలకమైన ధాన్యం సేకరణ జరుగుతున్న సమయంలో సివిల్ సప్లయిస్ డీఎంగా పౌరసరఫరాలశాఖ అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం సేకరణ సమయంలో డీఎంను కలెక్టర్ సరెండర్ చేశారు. ప్రత్యామ్నాయం కింద డీఎస్‌వోకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏ విషయంలోనూ ఫలితాలు చూపించలేని పరిస్థితి నెలకొంది. గతంలో డిసెంబరు మూడో వారంలో ధాన్యం చేతికొచ్చేది. కానీ ఈ సారి దాదాపు ఈ నెల మొదటి వారంలో నూర్పిళ్లు మొదలైనా కొనుగోళ్లకు సన్నద్ధతలో వ్యవసాయశాఖ వైఫల్యం స్పష్టంగా కనబడింది. తుఫాన్ ప్రభావంతో వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడవడం వంటివన్నీ అన్నదాతలను వెంటాడడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

ఇప్పటి వరకు 28,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అన్నదాతల చేతికి రాగా మద్దతు ధరకు సేకరించింది కేవలం 5,800 మెట్రిక్ టన్నులే. దాదాపుగా 15,000 టన్నుల ధాన్యం దళారుల పరమైంది. సేకరణ లక్ష్యాన్ని 50,000 టన్నులుగానే నిర్దేశించుకున్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల




విజేతల జట్టుకి ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య),డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న వర్సిటీ అంతర కళాశాల వాలీబాల్ టోర్నమెంట్ (మెన్) మంగళవారం ముగిసింది. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్ల మధ్య సాగిన పోటీలో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు మొదటి స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో వర్సిటీ కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు, నాల్గొవ స్థానంలో ధనలక్ష్మి కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచాయి. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను వర్సిటీ వాలీబాల్ (మెన్) జట్టులోకి తీసుకుంటారు. త్వరలో కేరళ యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీస్ వాలీబాల్ (మెన్) టోర్నమెంట్‌లో వర్సిటీ జట్టు పాల్గొంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టోర్నమెంట్ పరిశీలకులు డాక్టర్ సూర్యనారాయణ, సెలక్షన్ కమిటీ మెంబెర్స్ పాతూరి శ్రీనివాస్, జే. ప్రేమ్ కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ డా.పి.గౌరీ శంకర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్. శివ రామకృష్ణ తెలిపారు. విజేతలను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

19, 26 తేదీల్లో శబరిమలకు అదనపు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈ నెల 19, 26 తేదీల్లో అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07175 సికింద్రాబాద్ - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 19, 26 (గురువారం) తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదుగా శుక్రవారం అర్థరాత్రి దాటాక 1.30కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07176 కొల్లం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 21, 28 తేదీల్లో (శనివారం) వేకువ జామున 5 గంటలకు బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1.30కి సికింద్రాబాద్ చేరుకొంటుందన్నారు.

మిర్చి రైతులను ఆదుకోండి



- పంటకు కనీస మద్దతు ధర కల్పించండి
- కేంద్ర మంత్రులు పీయూష్, శివరాజ్‌సింగ్‌కు డాక్టర్ పెమ్మసాని వినతి

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని మిర్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియాలో మిర్చి విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. పెరుగుతున్న పెట్టుబడులు, చీడపీడల బెడద, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మిర్చి రైతుల జీవనోపాధి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు మంగళవారం పెమ్మసాని లేఖ రాశారు. మిర్చి బోర్డు ఏర్పాటు ద్వారా చీడపీడల నివారణ, ఎగుమతి సౌకర్యాలు, ఆధునిక ప్రాసెసింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. మిర్చికి కనీస మద్దతు ధర కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పెమ్మసాని విజ్ఞప్తి చేశారు. మిర్చి ఎకరా సాగు సగటు వ్యయం 2.50 లక్షలకు చేరిందని, 2022-23 నుంచి మిర్చి ధరలు 50 శాతం పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కౌలు రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని జనసేన నియోజకవర్గ నాయకులు జొన్నా రాజేష్ హెచ్చరించారు. మంగళవారం తాడేపల్లిలోని జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లా మాట్లాడారు.

సీపీఐ మంగళగిరి ఇన్‌చార్జి కార్యదర్శిగా

ప్రభాకరరావు

మంగళగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ సీపీఐ ఇన్‌చార్జి కార్యదర్శిగా అన్నవరపు ప్రభాకరరావు నియమితులైనట్లు ఆ పార్టీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1995లో సీపీఐలో చేరిన అన్నవరపు అనేక ప్రజాపోరాటాల్లోనూ, కార్మికసంఘాల పోరాటాల్లోనూ చాల చురుకుగా వ్యవహరించారు. ఆ పార్టీ ప్రజా సంఘాల్లో పని చేస్తూ వచ్చారన్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు

1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 2175 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 64 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 84, పశ్చిమ కాల్వకు 56, నిజాంపట్నం కాల్వకు 126, కొమ్మమూరు కాల్వకు 1611 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

260 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 10: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 260 బస్తాల పసుపును రైతులు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 11,000, గరిష్ఠ ధర రూ.11,375, మోడల్ ధర రూ.11,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 11,000, గరిష్ఠ ధర రూ.11,375, మోడల్ ధర రూ.11,000 పలికాయి.

కల్లాల్లో ధాన్యం పరిశీలన

దుగ్గిరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వరరావు సందర్శించారు. అనంతరం కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2300 చొప్పున మద్దతుధరకు కొనుగోలు చేస్తోందని, గోతాములు సైతం రైతుసేవాకేంద్రాల ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. తేమశాతం 17 ఉంటే తరుగు లేకుండా 17 నుంచి 22 శాతం వరకూ ఒక్కోశాతానికి ఒకకిలో చొప్పున తరుగు తీసి పూర్తిధరను చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులెవ్వరూ తక్కువ ధరకు దళారులకు ధాన్యం విక్రయించాల్సిన అవసరం లేదన్నారు. ఏవో పీ శిరీష, ఏఈవో రమేష్, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం వితరణ

మంగళగిరి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం (శివాలయం)లో సోమవారం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి నెలా అమావాస్య తర్వాత వచ్చే మొదటి సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుంది. ఈ ఆనవాయితీ ప్రకారం ట్రస్టు చైర్మన్ పందేటి సాంబశివరావు, 32 మంది ట్రస్టు సభ్యులు కలిసి ఈ సోమవారం అన్నదానం చేశారు.

గ్రామాభివృద్ధికి కృషి..

పెదనందిపాడు, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్ళ గ్రామాభివృద్ధికి పాటుపడడంతో పాటు, ఎక్కడా అవినీతికి పాల్పడలేదని అన్నపర్రు ఎంపీటీసీ సభ్యుడు కల్లూరి నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని అన్నపర్రులో మంగళవారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టానని, కావాలనే కొంత మంది వ్యక్తులు దురుద్దేశంతో తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలను నిరూపిస్తే తాను ఎలాంటి చర్యలకైనా సిద్ధంగా ఉన్నాని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కూడా మా గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

● తహసీల్దార్ కరుణ కుమార్

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి రెవెన్యూ సమస్యలకు చక్కటి పరిష్కార వేదిక గ్రామ సదస్సులని, వీటి ద్వారా రైతులు, ప్రజలు వారి భూ సంబంధిత సమస్యలను పరిష్కరించు కోవచ్చునని ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ సూచించారు. మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో రైతులు తమ పొలాలకు సంబంధించి వివిధ రకాల సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకు వచ్చారు. వీటిలో పరిష్కారమయ్యే విషయాలను సత్వరమే అక్కడికక్కడ పరిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

దాతల సహకారంతోనే

గ్రంథాలయాలు అభివృద్ధి

పెదనందిపాడు, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో గ్రంథాలయాలు అభివృద్ధి చేసుకోవాలని గ్రంథాలయ శాఖ జిల్లా కార్యదర్శి వి సుబ్బరత్నమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయంలో పాఠకులను పెంచాలని, చెస్ వసూలు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

వీడని అలసత్వం !

● పనివేళల్లో తహసీల్దార్ కార్యాలయ గదులకు తాళం
● మధ్యాహ్నం వరకు తెరవని వైనం
● ప్రజలు, రైతుల ఆగ్రహం
● గతంలో కలెక్టర్ హెచ్చరించినా తీరు మార్చుకోని అధికారులు, సిబ్బంది


తాళం వేసివున్న తహసీల్దారు కార్యాలయ గది


తహసీల్దారు కార్యాలయం

కాకుమాను, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకుమాను తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీంతో రెవెన్యూ సమస్యలపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో నిర్ఘాంతపోయారు. మంగళవారం మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు తాళం వేసి ఉండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి తురయ్యారు. కార్యాలయంలోని ముఖ్య అధికారులు మాత్రమే రెవెన్యూ సదస్సులకు హాజరు కాకా మిగిలిని సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియటంతో సిబ్బంది మధ్యాహ్నం 12 గంటలు తర్వాత సిబ్బంది హుటాహుటిన కార్యాలయానికి తాళం తీశారు. ఇక్కడ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామి ఎమ్మెల్యే రామాంజనేయులు గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న సమయంలో కలెక్టర్ కార్యాలయంలో సీసీగా పని చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు కావాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కాకుమానులో పోస్టింగ్ ఇప్పించారు.

నవంబరు 27న కలెక్టర్ నాగలక్ష్మీ కార్యాలయంలో సిబ్బంది తీరుపై ఫిర్యాదులు రావడంతో ఆకస్మిక కార్యాలయ తనిఖీ నిర్వహించారు. అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం, ఫిర్యాదుల పరిష్కారం పెండింగ్‌లో ఉండడం వంటి వాటిపై తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్‌లను ఒక్కొక్కరిని ఎమ్మార్వో గదిలోకి పిలిచి కొంత మేర అసహనాన్ని వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. అయినప్పటికీ మంగళవారం కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో అధికారుల అలసత్వ తీరు మరోసారి బయటపడింది. ఇటువంటి సంఘటనలుపై ఉన్నతాధికారులు స్పందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ. సీఐ కళ్యాణ్‌రాజు

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

తాడేపల్లిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వివాహితపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో నిందితుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కళ్యాణ్‌రాజు వివరాలు వెల్లడించారు. ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి పట్టణ పరిసరాల్లో నివాసముంటున్న 40 ఏళ్ల వివాహితను ఒంటరిగా ఉన్న సమయం చూచి తాడేపల్లికి చెందిన పీ.రామారావు బలవంతంగా అత్యాచారం చేసి పారిపోయాడు. బాధిత మహిళ 9వ తేదీ ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన సీఐ కళ్యాణ్‌రాజు ముగ్గురోడ్డు సమీపంలో నిందితుడు రామారావును అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న సీఐ కళ్యాణ్‌రాజు సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

సినిమా హాల్లో తహసీల్దార్ తనిఖీ

● టిక్కెట్ రేట్లపై ఫిర్యాదు అందటంతో..
● ప్రేక్షకులను అడిగి ఆరా తీసిన తహసీల్దారు
● అధిక ధరకు విక్రయించినట్లు వెల్లడి
● పూర్తి నివేదిక ఇవ్వాలని వీఆర్వోకి ఆదేశం


థియేటర్‌లో ప్రేక్షకులను అడిగి టికెట్ రేటు వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ కరుణ కుమార్

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని సినిమా థియేటర్‌లో ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా రెండు తరగతుల టిక్కెట్లు మాత్రమే అమ్ముతున్నట్లు తేలింది. అంతేకాకుండా అనుమతి లేకుండా ఏసీ క్యాబిన్ నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఈ థియేటర్‌లో అధిక ధరలకు టిక్కెట్లు అమ్ముతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ తనిఖీ నిర్వహించారు. పుష్ప-2 సినిమా తొలి రోజు టిక్కెట్‌ను రూ.500 అమ్మినట్లు టికెట్లు అమ్మినట్లు తెలిసింది. అంతే కాకుండా టికెట్‌పై ధర ముద్రణ లేకుండా రూ.200, రూ.150లకు అమ్ముతున్నారు. టిక్కెట్టు ధరల పట్టిక లేక పోవడాన్ని తహసీల్దార్ ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని తరగతుల టిక్కెట్లు అమ్మాల్సింది పోయి కేవలం రెండు తరగతులకు మాత్రమే టిక్కెట్లు విక్రయించడాన్ని తహసీల్దార్ కరుణ కుమార్ తప్పుబట్టారు. థియేటర్‌లో ప్రేక్షకులను అడిగి రేట్లు తెలుసుకున్నారు. ప్రత్తిపాడులోని థియేటర్‌లో కేవలం రూ. 40లకు మించి టిక్కెట్లు అమ్మడానికి వీలు లేదని తహసీల్దార్ తేల్చి చెప్పారు. అయితే పుష్ప-2 సినిమాకు సంబంధించి అదనపు వసూళ్లకు ప్రభుత్వం ఇచ్చిన జీవో గ్రామ స్థాయిలో ఉన్న థియేటర్‌లకు వర్తిస్తుందా లేదా అన్నది తెలియాల్సి ఉందని తహసీల్దార్ తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని వీఆర్వో షఫీని ఆదేశించారు.

వంగవీటి రంగా

విగ్రహ ఏర్పాటుకి భూమిపూజ

మంగళగిరి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం విగ్రహ ఏర్పాటుకు సంబంధించి దిమ్మెను నిర్మించేందుకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిరంగిపురం పంచాయతీకి

స్వచ్ఛ ఆత్మగౌరవ పురస్కారం

ఫిరంగిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయానికి స్వచ్ఛ ఆత్మగౌరవ పురస్కారాన్ని దక్కించుకొందని ఈవో ఏకే బాబు తెలిపారు. మంగళవారం గుంటూరు జిల్లాపరిషత్ మీటింగ్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా చేతుల మీదుగా సర్పంచ్ మేడా బాబు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బాబుని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఫిరంగిపురంలో సచివాలయం - 1 వద్ద కమ్యూనిటీ శానిటరీ మరుగుదొడ్ల నిర్మాణంచేసి వాటిని సక్రమంగా నిర్వహిస్తున్నందుకు ఈ అవార్డు లభించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఈవో జిల్లా అధికారులు పలువురు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

ఫిరంగిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన సమస్యలకు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం చూపుతామని ఫిరంగిపురం మండల తహసీల్దార్ జే ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని 113 తాళ్ళూరు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, గ్రామస్థులు తమ భూసమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు. ఈ సదస్సులో పట్టాదారు పాసు పుస్తకాల కోసం 14, సర్వే కోసం ఒక అర్జీ వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రిజిస్టర్ శాఖ అధికారులు, దేవాదాయ, ధర్మాదాయ ఈవో శ్రీనివాసరావు, ఆర్ఐ రెహ్మాన్, సర్వేయర్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న రైతులు

లంకభూముల రైతులకు న్యాయం చేయాలి

దుగ్గిరాల, డిసెంబరు 10: మండలంలోని గొడవర్రు, పెదకొండూరు తదితర గ్రామాల్లోని లంకభూముల రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించి న్యాయం చేయాలని కోరుతూ రైతు సంఘాల, కౌలురైతుసంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. పెదకొండూరులో మంగళవారం జరిగిన సదస్సులు రైతులు పలుభూసమస్యలపై వినతిపత్రాలు అందించారు. తహసీల్దార్ ఐ. సునీత రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు భూసమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుకు హాజరైన కైలు రైతుసంఘ జిల్లా నాయకుడు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, దశాబ్దాలకాలంగా లంకప్రాంతంలో నదీతీరాన సాగుభూములు ఉన్నప్పటికీ పట్టాదారు పుస్తకాలు అందించకపోవడంతో రైతులు పంటలను విక్రయించే సదర్భంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దారుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసరి విజయలక్ష్మి, వెలివెల ధనుంజయరావు, మొలబంటి ఏడుకొండలు, అనిశెట్టి వెంకటేశ్వరరావు, అంకం శేషగిరిరావు, శీలం వీరరాఘవయ్య, బర్మా శ్రీనివాసరావు పలువురు రైతుసంఘాల నాయకులు ఉన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

తాడికొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడికొండలోని వెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి ఎస్ఆర్ఐ చెరుకూరి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా పేద, ప్రతిభావంతులైన విద్యార్థినులకు మంగళవారం సైకిళ్ల పంపిణీ చేశారు. రూ. 50వేలు విలువ చేస 10 సైకిళ్లను విద్యార్థినులకు పాఠశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ కే.అమల, పాలవర్గ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.వీ.వీ. ప్రసాద్ మాట్లాడుతూ 1989-90 బ్యాచ్‌కు చెందిన చెరుకూరి శ్రీధర్ సైకిళ్ల పంపిణీచేయటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎం.రవిబాబు, అధ్యాపకులు వెంకటరమణయ్య తదితరలు పాల్గొన్నారు.

భావాల వ్యక్తీకరణకు భాష దోహదం

కాకుమాను, డిసెంబరు 10)ఆంధ్రజ్యోతి): జాతీయ భావాలను పెంపొందించుకోవడానికి జాతీయ భాష హిందీ ఎంతో దోహదం చేస్తుందని మండల విద్యాశాఖాధికారి కే.ఎఫ్ కెన్నడీ అన్నారు. మండల పరిధిలోని కొండపాటూరు ఎంపీయుపీ పాఠశాలలో మంగళవారం దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారి పరిచయ ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష సర్టిఫికెట్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల లోని 43 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా మొత్తం విద్యార్థులు ప్రథమ శ్రేణి, అలాగే నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు ప్రమీలాదేవి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని కొనియాడారు. మండలంలో కొండపాటూరు ఎంపీయుపీ పాఠశాలలో హిందీలో విద్యార్థులు విశిష్ట ప్రతిభను కనపరచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శీలం అంకారావు, ఎస్ఎంసీ చైర్మన్ నాగాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బంగారు పతకం అందుకుంటున్న హాశిష్

నేషనల్ స్కేటింగ్ పోటీల్లో

హాశిష్‌కు బంగారు పతకం

తాడేపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని పొలాచ్చిలో రోలర్ స్కేటింగ్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15 వరకు జరుగుతున్న 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సోమవారం తాడేపల్లి పట్టణం డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాశిష్ బంగారు పతకం సాధించాడు. ఈ పోటీల్లో 13 రాష్ట్రాలకు చెందిన స్కేటింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. గుంటూరు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ తరపున ఏపీ నుంచి హాశిష్ పాల్గొని అండర్-14 విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. సోమవారం రాత్రి క్రీడా ప్రాంగణంలో తమిళనాడు రోలర్ స్కేటింగ్ అధ్యక్షులు చంద్రశేఖర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా హాశిష్ తల్లిదండ్రులు రాజు,శివమాధవిలు కోచ్ సత్యనారాయణ, చిట్టిబాబు, ఏపీ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి థామస్, గుంటూరు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలిమ, ప్రశాంత్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

తాడేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తు చూపిన బాటలో మనమంతా నడవాలని యేసు బోధనలు అనుసరణీయమని తాడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు అమరా సుబ్బారావు అన్నారు. మంగళవారం ప్రాతూరులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్బంగా కేక్ కట్ చేసి పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేశారు. అమరా సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచమంతా జరుపుకునే ఏకైక పండుగ, కులమతాలకు అతీతంగా ఘనంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అన్నారు. క్రీస్తు ఆశీస్సులు అందరికి ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా 30 మంది పాస్టర్లకు మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో అరవపల్లి శ్రీనివాస్ సహకారంతో కార్యక్రమంలో టీడీపీ నేతలు కొల్లి శేషు, అరవపల్లి శ్రీనివాస్, బొర్రా కృష్ణవందన, సాంబశివరావు, నరసింహారావు, దిబ్బయ్య, అంద్రియ, కోటేశ్వరరావు, భాగ్యరాజు, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

● పెదనందిపాడు ఎంపీడీవో లక్ష్మీదేవి

పెదనందిపాడు, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సుస్థిర అభివృద్ధిపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పచ్చదనం పరిశుభ్రత స్వయం సమృద్ధిగా మౌలిక సదుపాయాలు కల్పన, పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వర్ధిని, ఏవో స్వామిరెడ్డి, రీసోర్స్‌పర్సన్ నాగయ్య, గ్రామ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలు

సకాలంలో చెల్లించాలి

పెదనందిపాడు, డిసెంబరు, 10 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సభ్యులు సకాలంలో చెల్లించాలని ఏపీఎం ఎం సుబ్బారావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం పెరటిలో మొక్కలు పెంపకానికి ప్రోత్సామందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొదుపు తప్పనిసరిగా చెల్లించడం వలన కుటుంబ అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మహిళల జీవనాన్ని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం రుణసౌకర్యం కల్పిస్తుందని, తద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బాజీబీ, ఎఫ్‌పీవో సీసీ సుందరి, సీసీ శ్రీనివాసరావు, దానమ్మ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో గ్రామసభ

● హాజరైన తహసీల్దారు వెంకటస్వామి

కాకుమాను, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూమి సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సును ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. మండల పరిధిలోని వల్లూరులో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. సదస్సులో అడంగల్ పాసు పుస్తకాల కోసం 16 అర్జీలు, సర్వేకు 17, ఇతర శాఖలకు సంబంధించిన మూడు అర్జిలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీ వెంకట రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, సబ్ రిజిష్ట్రార్, దేవాదాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


ర్యాలీనిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

సైబర్ నేరాల పట్ల

అవగాహన కలిగి ఉండాలి

మేడికొండూరు డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ చెప్పారు. సైబర్ నేరాలపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా మేడికొండూరు పీఎస్ పరిధిలోని పేరేచర్ల సెంటర్‌లో విద్యార్థులతో కలసి పోలీసులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో ఇంటర్‌నెట్ ఆధారిత ఆన్‌లైన్ ద్వారా అనేక సేవలు అందుతున్నాయని, వీటి వినియోగం నేడు అనివార్యమైందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎంతోమంది ఎన్నో విధాలుగా నష్టపోతున్నారని, ఆన్‌లైన్ మోసాల కారణంగా చాలా మంది నగదుతో పాటు పరువును కూడా పోగొట్టుకుంటున్నారని, ఈ మోసాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన కల్పించాలని సీఐ నాగూర్ మీరాసాహెబ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ కళాశాల హెచ్‌వోడీ చంద్రమౌళి, ఏవో బండారు సీతారామయ్యలతో పాటు యూనివర్సల్, ఎస్ఆర్ఐ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

13న రైతు సమస్యలపై ర్యాలీ

● మాజీ మంత్రి అంబటి వెల్లడి

తాడేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై ఈనెల 13న శుక్రవారం జిల్లాలో ర్యాలీ, కలెక్టర్‌కు విజ్ఞాపనపత్రం అందజేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం తాడేపల్లి మండలం గుండిమెడ, చిర్రావూరు గ్రామ శివారుల్లో పలువురు రైతులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు, వెంకటనాగేశ్వరరావు, రుక్మాంగరెడ్డి, సాంబశివరావు, అర్జున్‌రెడ్డి,నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి

కౌన్సిల్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు

కాట్రపాడు విద్యార్థుల ఎంపిక

వట్టిచెరుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కౌన్సిల్ క్విజ్ పోస్టర్ కాంపిటీషన్‌కు కాట్రపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయినట్లు హెచ్‌ఎం కేవీ లక్ష్మి తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యెద్దు చంద్రిక పోస్టర్‌లో, కొణిదల నందిని క్విజ్ పోటీలకు ఎంపియ్యారన్నారు. వీరికి గైడ్ టీచర్‌గా వీఎస్ రామాంజనేయులు వ్యవహరించారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ శివశంకర్, హెచ్‌ఎం లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ రాధాకృష్ణలు అభినందించారు.

వధూవరులకు పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న ఈపూరి బాబు, కాట్రగడ్డ మధు తదితరులు

తాడేపల్లి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం గ్రామానికి చెందిన నంబూరు సాంబయ్య కుమారుడి వివాహానికి హాజరై, వధూవరులు సింధూ-రూకేష్‌లకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను మంగళవారం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూ దనరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, వడ్డేశ్వరం అబ్రహం, కత్తిక శ్రీరాములు, వంగూరి భీముడు, వడ్డేశ్వరం ప్రసాద్, లక్ష్మణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాడి వేడిగా సర్వసభ్య సమావేశం

వట్టిచెరుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చిలకా రాజ్యం అధ్యక్షతన వాడివేడిగా జరిగింది. వైసీపీకి చెందిన మండల పరిషత్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు సుజాత ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి కూటమి ప్రభుత్వ తీరును ప్రశ్నించే విధంగా మాట్లాడేందుకు ప్రయత్నించగా.. 'గత ఐదు సంవత్సరాలుగా అధికారంలో ఉండి తోటి సభ్యులకు చెప్పకుండా నిధులను పక్కదారి పట్టించారు. తోటి సభ్యులకు నిధులు మంజూరు అయిన విషయాన్ని ఎవరికైనా చెప్పారా.. ఇప్పుడు మాపై ఆరోపణలు చేయాలని చూస్తే సహించేది లేదు' అని వింజనంపాడు టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు సుజాత హెచ్చరించారు. గత ఐదు సంవత్సరాలుగా ఏయే పథకాలకు ఎంత నిధులు వచ్చాయి.. ఏయే గ్రామానికి నిధులు కేటాయించారో తెలిపారా? అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తొలగించిన వీవోల స్థానంలో కొత్తవారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని, అవకతవలకు పాల్పడిన వారి నుంచే దుర్వినియోగం చేసిన నిధులను రాబట్టాలని, కొత్తగా నియమితులయ్యే వారికి ఎలాంటి సంబంధం లేదని హామీ ఇవ్వాలంటూ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వరి పైరు పరిశీలన


పడి పోయిన వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వట్టిచెరుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపాడు గ్రామానికి చెందిన ఐనంపూడి కిషోర్ అనే రైతు తనకు చెందిన 18 ఎకరాల వరి సాగులో మెగా మౌనిక కంపెనీకి చెందిన మెగా కిల్ అనే దోమ మందు తెచ్చి పిచికారి చేశాడు. ఆ మందు పని చేయక పూర్తిగా నష్టపోయానని సోమవారం రైతు కిషోర్ కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గుంటూరు ఏడీఏ శ్రీనివాసరావు, లాంఫారంలోని వివిధ విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు కాట్రపాడులోని రైతు పొలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. 18 ఎకరాల్లో కొంత భాగం బాగానే ఉన్నా కొంత భాగం పైరు దోమపోటుకు గురై నేలవాలిందని రైతు కిషోర్ శాస్త్రవేత్తలకు వివరించాడు. గుంటూరులోని షాపునుంచి తాను తెచ్చిన మందు బుడ్డిలో ఒకటో రెండో తేడా ఉన్నట్టు తనకు అనుమానం ఉందని రైతు వివరించాడు. ఇదే విషయాన్ని ఇటీవల మార్కెట్ యార్డుకు వచ్చిన వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు జిల్లా వ్యవసాయ అధికారి, ఏడీఏ, ఏవోలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో పైరు స్థితిగతులను ఏడీఏకు, కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఏడీఏ శ్రీనివాసరావు, డీఆర్‌సీ రాజవంశీ, శాస్త్రవేత్తలు కామాక్షి, మధురవాణి, డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకటలక్ష్మి, స్థానిక ఏవో కే లక్ష్మి, ఏఈవోలు పాల్గొన్నారు.

భవన నిర్మాణదారులు ప్రత్యేక డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘ పరిధిలో భవన నిర్మాణ యజమానులు పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రత్యేక డెస్క్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ యజమానులు, లైసెన్స్‌డు సర్వేయర్లు, పట్టణ ప్రణాళిక అంశాలకు సంబంధించిన సమస్యలున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ కోరారు.

2వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని 2వ డివిజన్‌లో మంగళవారం జరుగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100శాతం చెత్తను ఇంటి వద్దనే శానిటేషన్ సిబ్బంది సేకరించాలని ఆదేశించారు. ప్రజలు కూడా మూడు బుట్టల విధానాన్ని పాటించి సుందర తెనాలికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సర్‌చార్జీల భారం తగ్గించాలి: సీపీఐ

పొన్నూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ సర్‌చార్జీల భారం తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాళ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ధరలు నియంత్రిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్న ఇప్పటికి ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. అలాగే విద్యుత్ ఒప్పందంలో ఆదాని లంచంగా ఇచ్చిన రూ. 2 వేల కోట్లపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆరేటి రామారావు, షేక్ గౌస్, దేవరకొండ శ్రీనివాస్, ఆరేటి సురేష్, భవానీ, సుగుణ, జాలమ్మ, కోటేశ్వరరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ నేత లక్ష్మయ్యకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నేత చెన్నుపాటి లక్ష్మయ్య ఆదర్శప్రాయుడని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఇర్షాద్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ హక్కుల కోసం లక్ష్మయ్య చేసిన సేవలను మననం చేసుకున్నారు. ఆంధ్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటులో లక్ష్మయ్య కృషి ఎనలేనిది అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసి విద్యారంగ అభివృద్ధికి లక్ష్మయ్య ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీదేవి, శ్రీకాంత్, సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు పాల్గొన్నారు.

దండమూడిలో నకలీ పొదుపు సంఘాలతో రుణాలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దండమూడిలో ఓ యానిమేటర్ నకిలీ పొదుపు గ్రూపులను ఏర్పాటుచేసి రుణాలు స్వాహా చేసిన సంఘటన వెలుగు చూసింది. మండల పరిధిలోని దండమూడిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. గ్రామంలోని నిరక్షరాశ్యులు, వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలను గుర్తించి వారి పేరుతో నకిలీ పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘాల పేరుతో డ్వాక్రా విభాగంలోని యానిమేటర్, ఓ ప్రజా ప్రతినిధి అండతో ఈ నకిలీ రుణాలను పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ భోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొంది రుణాలు చెల్లించకపోవటంతో బ్యాంక్ అధికారులు ఇటీవల డ్వాక్రా అధికారులను సంప్రదించారు. అయితే దీనిపై ప్రాథమిక విచారణ చేపట్టిన అధికారులకు నిరక్ష్యరాసులను మోసగించి వారి తో నకిలీ గ్రూపులను ఏర్పాటుచేయించి వారి పేరుతోనే రుణాలు పొందినట్లుగా గుర్తించారు. ఈ బోగస్ గ్రూపులో ఉన్న వ్యక్తులకు తాము రుణాలు పొందినట్లుగా తెలియకపోవటం గమనార్హం. ఇప్పటి వరకు రూ.9.50 లక్షలు ఈ బోగస్ గ్రూపుల ద్వారా రుణాలు పొందినట్లుగా గుర్తించారు. సమగ్ర విచారణ జరిపితే మొత్తం బోగస్ గ్రూపుల వ్యవహారం బయట పడుతుందని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు. దీనిపై ఏపీఎం జోయబాబును వివరణ కోరగా బోగస్ గ్రూపుల రుణాలపై ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు చెప్పారు. విచారణ పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు.

కాలువలో దూకిన మహిళ.. రక్షించిన స్థానికులు

తెనాలి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునేందుకు కాలువలో దూకిన మహిళను స్థానికులు కాపాడారు. మండలంలోని జగ్గడిగుంటపాలెం సమీపంలో టిడ్కో గృహ సముదాయాల ప్రాంతంలో నివాసముంటున్న ఓ మహిళ కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థలతో ప్రధాన రహదారిపై ఉన్న కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని గమనించిన స్థానికులు కాలువలో దూకి ఆమెను కాపాడారు. కాలువ బాగా లోతుగా ఉండటంతో ఆమెను పైకి తీసుకువచ్చేందుకు రెండు ఎక్స్‌కవేటర్‌లను తెప్పించి ప్రాణాలు కాపాడారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: ఏవో

పొన్నూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి డేగల వెంకట్రామయ్య కోరారు. మండల పరిధిలోని పచ్చల తాడిపర్రులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు.

దేవాలయంలో వంద కిలోల ఇత్తడి మాయం


పొన్నూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఓ ఉపాలయానికి చెందిన వంద కిలోల ఇత్తడి మాయమైన సంఘటన వెలుగు చూసింది. ఈ పుణ్యక్షేత్రంలో దశవతారాల ఆలయం ఉండగా, ఇందులో పది అవతారాలకు సంబంధించి ఉపాలయాలు ఉన్నాయి. ఈ ఉపాలయాలన్నింటికీ కలిపి ఓ ధ్వజస్తంభం ఉంది. ఈ ధ్వజస్తంభాన్ని 2022 మే 12న పునఃప్రతిష్ఠించారు. దీనిని ప్రతిష్ఠించక ముందు పాడైపోయిన ధ్వజస్తంభానికి వంద కిలోల వరకు వెండి తొడుగులు, మానికలు, పాలవెల్లి వంటి అలంకారాలకు ఇత్తడి తొడుగులు ఉండేవి. అయితే, ఆ ఇత్తడి తొడుగులు, వెండి వస్తువులు నేటికి ఆలయంలో కనిపించడం లేదు. ఇదిలా ఉండగా, నూతన ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులు చేయించేందుకు ఓ మహిళా దాత ముందుకు వచ్చి ఆలయ అధికారులను కలిశారు. వంద కిలోల ఇత్తడి అవసరమని, కిలో ఇత్తడి రూ.1400 చొప్పున రూ.1,40,000 దాత నుంచి విరాళంగా అధికారులు తీసుకున్నట్లు సమాచారం. అయితే, 2022 నుంచి ఈ ఇత్తడి తొడుగులు నూతన ధ్వజస్తంభానికి అమర్చలేదు. తిరిగి ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం రెండేళ్లకే శిథిలావస్థకు చేరింది. పాత ఇత్తడి తొడుగులు మాయంకావడం, మహిళా దాత ఇచ్చిన విరాళంతో కొత్త ఇత్తడి తొడుగులు చేయించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉద్యోగి ప్రమేయంపై ఆరోపణలు

ఈ తతంగం బదిలీ అయిన ఓ అధికారి పర్యవేక్షణలో జరిగిందని, పాత ఇత్తడి తొడుగులను అమ్ముకొని ఆ నగదును స్వాహా చేశారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవుడికే శఠగోపం పెట్టిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా

ఇత్తడి మాయంపై ఆలయ ఈవో అమర్నాథ్‌ను వివరణ కోరగా ఈ ఆరోపణలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరుపుతామని తెలిపారు. ప్రస్తుతం తమవద్ద ఇత్తడికి సంబంధించి ఎటువంటి రికార్డులు అందుబాటులో లేవని చెప్పారు.



శిథిలమైన దశావతారాల ఆలయ ధ్వజస్తంభం

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు పొన్నూరు వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు తమ సమస్యలపై వినతిపత్రం అందచేశారు. వికలాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలా జోజిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. గతంలో టీడీపీ హయాంలోనే వికలాంగుల పెన్షన్లు పెంచి ఇచ్చారన్నారు. ప్రస్తుత కూటమి పాలనలో వికలాంగుల పెన్షన్లను రూ.6వేల నుంచి రూ.15వేల వరకు ఇస్తున్నట్లు వివరించారు. గతంలో వికలాంగులకు రూ.2500లు, మూడు చక్రాల స్కూటర్లను అందించారని గుర్తు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. అయితే గత ప్రభుత్వ హయాంలో అనర్హులు సదరం క్యాంప్‌ల ద్వారా సర్టిఫికెట్లు పొంది పెన్షన్లు పొందుతున్నారన్నారు. దీనివల్ల నిజమైన దివ్యాంగులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెన్షన్లపై సమగ్ర దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. అర్హులైన వికలాంగులు ఇబ్బంది పడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వికలాంగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంక్‌లతో మాట్లాడనున్నట్లు చెప్పారు. దివ్యాంగులు నిర్వహించే వ్యాపారాలకు మున్సిపల్, మండల పరిషత్ అధికారులతో సమన్వయం చేసుకొని బ్యాంక్‌ల ద్వారా ముద్రా లోన్లు ఇప్పిస్తామన్నారు. అలాగే తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే అవకాశాలను పరిశీలించనునట్లు చెప్పారు. దివ్యాంగులకు ప్రత్యేక రేషన్ కార్డులు ఇచ్చే అంశంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనునట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో అసంబద్ధ నిర్ణయాలతో 7 వేల దివ్యాంగుల పెన్షన్లను నియోజకవర్గంలో తొలగించారని ఆరోపించారు. కుటుంబ సభ్యులు ఇన్‌కం ట్యాక్స్ కడుతున్నారని ఇల్లు ఉందనే కారణాలతో మంచానికే పరిమితమైన దివ్యాంగుల పింఛన్లు సైతం కనికరం లేకుండా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ అంశం కూడా ప్రభుత్వం దృషికి తీసుకెళ్లనునట్లు చెప్పారు. కృత్రిమ అవయవాల క్యాంప్‌లు నిర్వహించేందుకు స్వచ్ఛ సంస్థల సహకారం పొందుతామన్నారు. ప్రభుత్వం మూడు చక్రాల స్కూటర్లు ఇవ్వాలని సూత్రప్రాయంగా ప్రకటించినందున త్వరలోనే మార్గదర్శకాలు విడుదల అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా దివ్యాంగులకు అందాల్సిన ప్రతి సౌకర్యాన్ని అందించేందుకు పాటుపడతామన్నారు. అనంతరం ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్ పాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురుగుల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్టీసీ మేనేజర్ అజితకుమారి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, నియోజకవర్గంలోని దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

మురుగునీటి సమస్యను పరిష్కరించిన సబ్ కలెక్టర్

కొల్లిపర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చక్రాయపాలెంలో ఇరుగుపొరుగు గృహస్థుల మధ్య మురుగునీటి సమస్య వివాదాస్పదంగా మారింది. అడుసుమిల్లి కనక బసవయ్యకు చెందిన ఇంటి మురుగునీటిని వెళ్ళకుండా పొరుగింటి వ్యక్తి చందు సూర్యప్రకాశరావు అడ్డుకున్నాడు. దీంతో కనకబసవయ్య ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. అధికారులు జోక్యం చేసుకున్నప్పటికి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. సంవత్సరాల తరబడి నెలకొన్న ఈ సమస్య సబ్‌కలెక్టర్ సంజనాసిన్హ దృష్టికి రావటంతో మంగళవారం చక్రాయపాలెం గ్రామాన్ని సందర్శించి పోలీసు బందోబస్తు మధ్య మురుగుకాల్వను తీయించి ఆ సమస్యను పరిష్కరించారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ సిద్ధార్థ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



చక్రాయపాలెంలో మురుగుపోవటానికి కాల్వను తీయిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనాసిన్హ

ధాన్యం రైతుల సమస్యలు పరిష్కరించాలి: శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులు అమ్మకానికి పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టిపెట్టి వాటిని పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కంచర్లపాలెం, సోమసుందరపాలెం, కొలవరం గ్రామాల్లో పర్యటించి రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తరుగుకు సిద్ధంగా ఉన్నా, ధాన్యం ఎత్తే దిక్కులేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే వాటిని పరిష్కరించి రైతులను ఆదుకోవాలని శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వీరయ్యకు ఘన నివాళి

తెనాలి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేమూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొడాలి వీరయ్య వర్ధంతి మంగళవారం బుర్రిపాలెం రోడ్డులో నిర్వహించి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కొడాలి వీరయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాసిరెడ్డి ప్రియబాంధవి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధితో పాటు తెలుగుదేశం పార్టీ కోసం ఆయన అవిరళ కృషి చేశారని చెప్పారు. వైద్యుడిగా పట్టణ ప్రజలకు సేవలందించారని తెలిపారు. వాసిరెడ్డి రవికుమార్, విజయలక్ష్మి, తరుణ్, అంకినీడు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ప్రియబాంధవి తదితరులు

అత్యుత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దండి: ఎంపీడీవో దీప్తి

తెనాలి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మండల గ్రామాలను అత్యుత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ పంచాయతీ అవార్డులను పొందేలా పంచాయతీ, సచివాలయ అధికారులు, సర్పంచ్‌లతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ నెల 10 నుంచి 19 వరకూ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రైనర్ నాగేశ్వరరావు పలు అంశాలను వివరించారు. ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్, పాలనాధికారి శ్రీనివాసరావు, పలువురు పంచాయతీ, సచివాలయాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

మండల గ్రామాల్లో టాయిలెట్ల నిర్వహణ, పారిశుద్యం మెరుగుపరుస్తూ ఉత్తమ సేవలందించిన పలు గ్రామాల పారిశుధ్య కార్మికులకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్‌లు దుశ్శాలువాలతో సత్కరించి వారిని అభినందించారు. ఏవో శ్రీనివాసరావు, పలువురు పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించండి: చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాసముండే ప్రజలు వారి ఇంట, బయట వచ్చే చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. మంగళవారం పట్టణంలోని 25వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహాలలో, వ్యాపార సంస్థలలో వచ్చే చెత్తను డస్ట్‌బిన్‌లో ఉంచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కాలువల్లో అధిక సంఖ్యలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ సీసాలు ఇంకా కుళ్లిన కూరగాయలు వంటివి అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఇకనైనా వ్యర్థాలను కాలువలో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం

తెనాలి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలు సంస్థలు స్థాపించి సేవలు అందిస్తున్న తన్నీరు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం అందుకున్నారు. మంగళవారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు. కాకినాడ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆయన సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోడపాటి దాసు, ప్రధాన కార్యదర్శి స్వామి నాయుడు తదితరులు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

పీఆర్ గెస్ట్ హౌస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజోపకర పనులకు పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. 2019లో రూ.70 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సమీపంలో పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ను నిర్మించారు. అయితే గెస్ట్ హౌస్ ప్రారంభానికి ముందు ఎన్నికల కోడ్ రావటంతో ప్రారంభానికి నోచుకోలేదు. 2021లో ఈ గెస్ట్ హౌస్‌ను వైసీపీ నాయకులు అతితక్కువ నామమాత్రపు ధరకు లీజ్‌కు తీసుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ గెస్ట్‌హౌస్‌లో వైసీపీ కార్యాలయం నిర్వహించగా ఎన్నికల సంఘానికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ గెస్ట్‌హౌస్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ గెస్ట్‌హౌస్‌ను వైసీపీ చెందిన ప్రైవేటు వ్యక్తులను నుంచి స్వాధీనం చేసుకొని వినియోగించుకోవాలని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. గెస్ట్‌హౌస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ గెస్ట్ హౌస్‌లో ట్రైనింగ్ క్లాసులు నిర్వహించటం, ప్రభుత్వ కార్యకలాపాలు జరిగేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో రూ.50 లక్షల వ్యయంతో 2019లో పూర్తిచేసిన స్త్రీశక్తి భవనం, ప్రారంభించకుండా వదిలివేయటం వల్ల శిథిలమవుతుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే భవనానికి మరమ్మతులు చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు

● సబ్ కలెక్టర్ సంజనాసిన్హా

కొల్లిపర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూవివాద రహిత గ్రామాలు లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు ముఖ్యఉద్దేశమని సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగిలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆమె తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ సంజనాసిన్హ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతులు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియజేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వివిధ సమస్యలపై 12 దరఖాస్తులు వచ్చాయని వాటిని విచారణ చేసి త్వరలో పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఈవో పద్మావతి, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మున్నంగిలో జరిగిన రెవెన్యూ సదస్సులో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా

బస్సు, ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి: త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆర్టీసీ బస్సు, ఆటో కార్మికులు నిబంధనలు పాటిస్తూ నిర్ణీత ప్రదేశాలలో ప్రయాణికులను ఎక్కించుకోవాలని త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ చెంచుపేట ఓవర్ బ్రిడ్జి వద్ద గుంటూరు బస్టాప్ వద్ద నిర్ణీత ప్రదేశంలోనే ఆర్టీసీ బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు.

డొంక ఆక్రమించి అభివృద్ధికి అడ్డుపడుతున్నారు

తెనాలి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం గుడివాడ గ్రామ పరిధిలోని డొంకను అభివృద్ధి చేస్తుంటే ఆక్రమించిన వారు అడ్డుపడుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సబ్ కలెక్టర్ సంజన సిన్హాను కలిసి సమస్య వివరించారు. గ్రామం నుండి తెనాలి జేఎంజే కళాశాల వరకు వచ్చే డొంక ఆక్రమణల కారణంగా వెడల్పు తగ్గిపోయిందని, రైతులకు ఎంతో అవసరమైన ఈ డొంక రోడ్డులో ఆక్రమణలను తొలగించాలని రైతులు సబ్ కలెక్టర్‌ను కోరారు.

ప్రకృతి సాగు పద్ధతులు అవలంభించాలి

చేబ్రోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవనం కోసం ప్రకృతి సాగు పద్ధతులు అవలంభించాలని జిల్లా వనరుల కేంద్ర డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పంటల సాగుపై మండల పరిధిలోని సుద్ధపల్లి, శలపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు వెంకట్రావు పొలంలో 20 సెంట్లలో సాగు చేసిన 15 రకాల కూరగాయలు, ఆకుల కూరల పైర్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ఏడీఏ వి.రామకోటేశ్వరి, ఏవో శ్రీనివాస నాయక్, మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, యూనిట్ ఇన్‌చార్జ్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటంపై ఫిర్యాదు

తెనాలి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ చిట్టిబాబు అవినీతికి పాల్పడుతున్నాడని గ్రామసభలో పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మంగళవారం గ్రామంలో సర్పంచ్ బాషా, ఇన్‌చార్జ్ కార్యదర్శి ఉమాదేవి పలువురు అధికారుల ఆధ్వర్యంలో గ్రామంలో సభ నిర్వహించారు. సభకు హాజరైన పలువురు గ్రామస్థులు ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపుగా వందల్లో ఉపాధి కార్డు దారులంటే కేవలం 20 నుండి 30 మంది పేర్లు మాత్రమే నమోదు చేసుకుంటూ పెద్దసంఖ్యలో పనికి వచ్చినట్లు మచ్చర్లు వేస్తూ ఆ సొమ్మును డ్రా చేసుకుంటున్నాడని ఆరోపించారు.

విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు చర్యలు

● ఏడీఈ అశోక్‌కుమార్





తెనాలి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని విద్యుత్ ఏడీఈ బోరుగడ్డ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలో అమలు జరుగుతున్న విద్యుత్ విధానాలపై మంగళవారం ఆంధ్రజ్యోతికి వివరించారు.

ప్రశ్న: వేసవి డిమాండ్ అధిగమించేందుకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పట్టణంలో వేసవిలో తలెత్తే విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు సబ్ స్టేషన్ ప్రతిపాదన చేశాం. కొత్తపేటలో స్థలం ఇవ్వాలని ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మించేందుకు మున్సిపల్ అధికారులను కోరాం.

ప్రశ్న: విద్యుత్ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి?

జ: విద్యుత్ వినియోగదారులు తమ పనుల కోసం సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగితే ఏఈలు, ఏడీఈలకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుంలు మినహాయించి విద్యుత్ సిబ్బంది ఎవరూ కూడా అదనంగా డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు.

ప్రశ్న: ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యకు పరిష్కారం లేదా?

జ: తెనాలి డివిజన్‌లో ఇప్పటికే కొత్తగా పలుచోట్ల 30 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. ఓవర్ లోడ్ సమస్య అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: పీఎం సూర్యఘర్ టార్గెట్ సాధించారా?

జ: పట్టణంలో నాలుగు సెక్షన్ల పరిధిలో 1200 మంది ఈ పథకాన్ని వినియోగించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డోర్ టు డోర్ అవగాహన కల్పిస్తూ ఇప్పటి వరకు 400మందితో సోలార్ విద్యుత్ కోసం దరఖాస్తు చేయించాం. మార్చిలోగా టార్గెట్ సాధిస్తాం.



రైతులకు కొనుగోలు కూపన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ పంట పడించిన రైతు దగ్గర గిట్టుబాటు ధర వచ్చేవిధంగా, ప్రతి రైతు దగ్గర ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆరుదల లక్ష్మయ్య అను రైతుకు ధాన్యం కొనుగోలు కూపన్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పలపాడు సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బూసిబాబు, కొర్రపాటి సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పలు అంశాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

● మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

కొల్లిపర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులను పండించిన ధాన్యాన్ని ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అనేక ఆంక్షలు పేరుతో దగా చేస్తుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తూములూరులో రైతుల పండించిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి రైతుకు న్యాయం చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో కేవలం బస్తా ధాన్యాన్ని రూ.1300 నుంచి రూ.1400లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీన నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి జొన్నల శివారెడ్డి, నాయకులు ఈమని హరికోటిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, కొల్లి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం డాక్టర్ కాసరనేని జీవితం: మోపర్తి

పెదకాకాని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య, విద్య సాహిత్య కళా రంగాల్లో డాక్టర్ కాసరనేని సదాశివరావు అందించిన సేవలు నిరుపమానమని, ఆదర్శవంతమైన ఆయన జీవితం నేటి తరానికి దిక్సూచి అని డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు మోపర్తి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం లలిత కళానికేతన్ ఆధ్వర్యంలో జరుగనున్న పరిషత్ 14వ వార్షిక నాటిక పోటీల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో మానసిక వికాసానికి, వర్తమాన సామాజిక సమస్యలపై అవగాహనకు తోడ్పడతాయని పరిషత్ అధ్యక్షుడు అప్పసాని నాగమల్లేశ్వరరావు చెప్పారు. భవిష్యత్ తరాల వారికి విద్యతో పాటు కళారంగ పరిచయం కూడా అవసరమనే ఉద్దేశ్యంతో ఈ సంవత్సరం నుంచి స్కూలు పిల్లలతో కూడా నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని పరిషత్ కార్యదర్శి నందిపాటి ప్రసాద్ చెప్పారు. లలిత కళా నికేతన్ వ్యవస్థాపకుడు మోపర్తి కాళిదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 3 రోజులపాటు నాటికలు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 8 నాటికల పోటీలు ఉంటాయని పిల్లల నాటికలు ప్రత్యేక ప్రదర్శనలుగా ఏర్పాటు చేశామని అన్నారు. సభలో పెద్ది రమేష్, చిగురుపాటి రమేష్, మోపర్తి పరమేశ్వరరావు, అత్తోట సుబ్బారావు, మానుకొండ వెంకటేశ్వరరావు, మీరావలి, నందిపాటి రమణ, పిన్నమనేని చౌడేశ్వరరావు డాక్టర్ కాసరనేని కుటుంబ ప్రతినిధిగా జయశంకర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పంపిణీ

తెనాలి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశభక్తి, క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు విద్యా, ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యం లభిస్తుందని లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ మంగళవారం చెప్పారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, ఎన్‌సీసీతో సమాజానికి సేవ చేయవచ్చన్నారు. ఎన్‌సీసీలో అందించే సేవల ఆధారంగా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, అశోక్, ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న కల్నల్ మహేష్